REGISTERED NO. M. 1287.



రిజిష్టరునంబరు ఎమ్. 1287.

శ్రీ

# ఆంధ్రసేవ.

యను

విద్యావిషయప్రధానమగు

మాసపత్రిక.

ప్రతిమాసాదిని వెలువడును.

శ్రీలనొసంగు సత్క్రియల శేషము నాంధ్రమునందుఁ దెల్పఁగాఁ
జాలినయట్టి ప్రౌఢ లనిశంబు శ్రమంపడి జాణఁజేయఁ దాఁ
దేలిన పత్రికాంగన యిదే చనుదెంచెను నిష్ఠ ధాత్రియై
శీలముగల్గు నాంధ్రులకు సేవయొనర్పఁగ నాంధ్రసేవనాన్.

ఇది

శ్రీరాజా రావు వేంకట కుమార మహీపతి
సూర్యరాట్ప్రభువరేణ్యుని రాజధానియగు
శ్రీమత్పీఠికాపురమున

నున్న

అద్దంకి మాధవశాస్త్రిగారి యాధిపత్యమున
శ్రీవిద్వజ్జనమనోరంజనీముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడి ప్రకటింపఁబడును.

1917.

కాపీరైటు.

సంవత్సరమునకుఁ జందా రు 3-0-0 లు.
మూఁడురూపాయలుమాత్రము.

# విషయసూచిక.


1. గ్రంథస్వీకారము.

2. అలగ్జాండరు.
(Alexander, the Great)

3. ఇద్దరుదొంగలు.
(An adaptation from the Evenings at Home)
మ. రా. రా. శ్రీ గాడేపల్లి వెంకటేశ్వర్లుగారు, B.A. L.T., Headmaster I. S. School, Bhadrachalam.

4. వ్యవసాయము.
(Agriculture.)
మ. రా. రా. శ్రీ బి. విశ్వనాథంగారు, Chemical assistant, Research Institute, Koimbuttore.

5. మానవధర్మములు.

6. అమలవర్త
(A translation to Hamlet)
మ. రా. రా. శ్రీ నండూరి మూర్తిరాజుగారు, బి ఏ.

7. జూలియస్ సీజరు.
(Julius Caesar)

8. విజనసదనము
(A Novel)
మ. రా. రా. శ్రీ కవుకొండల వెంకటాద్రిపుగారు, బి. ఏ. బి. యల్, రాజమహేంద్రి.

# కృతజ్ఞతాపూర్వకనమస్కారములు.

ఇప్పుడు ప్రకటింపఁబడుచున్న యాంధ్రసేవఁబోలు విద్యావిషయప్రధానపత్రికల యావశ్యకత కిప్పటియాంధ్రమండలముయొక్క మహోత్సాహమే కారణము గావున నాంధ్రమండలికిఁ గృతజ్ఞతఁ బత్రికాముఖమునఁ జూపుచున్నాము. ఒత్తుడు గలిగించితిమని విసువుఁజూపక పనులనుండి తెఱపిచేసికొని వెట్టిసేవయని తిట్టక సంతోషపూర్వకముగ నాంధ్రులయందలియనురాగమున వ్యవధిలేనికాలములయందు వ్రాసి వాత్సల్యమున నీపత్రికకు వ్యాసములొసంగినవారికిఁ బ్రకటనమున మిగులఁ గృతజ్ఞతఁ జూపుచున్నాము. ఈపత్రికయొక్క పురోభివృద్ధి విద్వన్మణులిఁక నాంధ్రమున నంపెడు వ్యాసముల నాశ్రయించియుండును గావున నిఁక వ్యాసములనంపెడు మహనీయులయెడఁ గృతజ్ఞతగలిగి యుందుము. ఆంధ్రభాషావ్యాప్తిఁ గోరి పాఠశాలలందు మాతృభాషనుగూడ ప్రధానముగ నొనర్చి గొప్పతరగతులయందుఁగూడ మాతృభాషయావశ్యకముగఁ జదువవలయునని చట్టముల నేర్పరుపఁ బ్రయత్నములొనర్చువిద్యావ్యాపకవిద్వన్మండలీకార్యనిర్వాహకులకును స్వభాషాభిమానము గలప్రభువరేణ్యులకును గృతజ్ఞులమయ్యెదము. అవ్యవధికాలమున వ్రాయుటవలనఁ గలిగినగ్రంథకర్తలపొరబాటులకును విలేఖకులతొందరలచేతఁ గలిగినయపభ్రంశములకును ముద్రణమునందలి దోషలేశంబులకు నాంధ్రులు క్షమ గలిగియుండవలయునని కోరుచున్నాము. పత్రికకు నిలబాటుగలుగువఱకు చిన్నచిన్న యాతంకములచే సంచిక లించుక యాలస్యముగ బయలువెడలినను పత్రికాధిపతికి మాయయొనర్చునుద్దేశము నారోపింపవలదు. సంవత్సరమునకు నొసంగఁబడుచందా పన్నెండుసంచికలవఱకు నిలుచును. పన్నెండు సంచికలు చేరినవెనుకఁగాని యొకసారి చందాయిచ్చినవారివలనఁ దిరిగి చందావసూలు చేయఁబడదు. ఇఁక ముందాలస్యముగ సంచిక లెప్పుడేని బయలువెడలునెడ మన్నించెడుశాంతచిత్తులయెడఁ గృతజ్ఞతఁ జూపెదము. ఆంధ్రభాష యభివృద్ధినొందునటుల నీపత్రికాప్రకటనమున కనుజ్ఞ యిడినదొరతనమువారియుత్కృష్టతకుఁ గృతజ్ఞులము. సుజనులెల్లరు దోషంబులఁ బాటింపక గుణంబుల గ్రహియింపవలయును.

అద్దంకి మాధవశాస్త్రి,
ఆంధ్రసేవాపత్రికాసైపతి.

శ్రీ

విద్యావిషయప్రధానమగు 'నాంధ్రసేవ' యనుపత్రిక జ్ఞానప్రబోధకముగ నాంధ్రమునఁ బ్రతిమాసమున నెనుబదిపుటలకు లోనుగ నఱువదిపుటలకుఁ బైనఁ బ్రచురింపఁబడుచున్నది. ఇందు వ్యాసముల వ్రాయువారు తఱచుగ నాంగ్లేయసంస్కృతాంధ్రములయందుఁ బ్రవీణులుగ నుందురు. ఈవ్యాసములు మహాపురుషులచరిత్రములు రాజ్యాంగనిర్మాణము మున్నగువానిఁగుఱించియు, నాధునికశాస్త్రములఁ గూర్చియు. భాషావిషయమునఁ గావ్యములు మొదలగువానిఁ గూరిచియుఁ బండితపామర జనరంజకముగ వ్రాయఁబడును. జ్ఞానప్రబోధకముగఁ గూడ వ్రాయఁబడుటచేతఁ జదువరులించుక శ్రమపడినయెడల విశేషఫలంబు హస్తగతముఁ జేసికొందురు. ఈపత్రికఁ జదువఁజదువఁ జదువరుల కానంద మతిశయముగఁ గూర్చునటులఁ గూర్పఁబడును. అపూర్వములును, నముద్రితములును, హృద్యపద్యాత్మకములు నగు సంస్కృతాంధ్ర ప్రబంధములు గూడ లభించిన నిందుఁ బ్రకటింపఁబడును.

విద్యాభోజు లగుప్రభువరేణ్యు లెల్లరు దీనికి రాజపోషకులుగ నుండఁ బ్రార్థితులు. దీనివలన జ్ఞానము వడయఁ గోరువారును, దీనియందలి విషయముల నాంధ్రమండలమున వ్యాపింపఁజేయఁ దలఁచువారును, దీనిఁ బోషింపఁదలఁచు నితరులును దీనికి శాశ్వతముగఁ జందాదారులుగ నుండవలయునని విన్నవించికొనుచున్నారము. విద్వన్మణులు వ్యాసముల నంపుదురేనిఁ గృతజ్ఞతాపూర్వకముగ నందికొని యిందులసభ్యుల యనుమతివడసినయెడల నిందావ్యాసములు ప్రకటింపఁబడును. అటుల వీలులేనియెడలఁ గృతజ్ఞతతో వ్యాసముల నంపెడువారికిఁ దిరుగ వానినంపెదము. ఆంధ్రులెల్లరు నీపత్రికకు బహువిధములఁ దోడ్పడఁగోరెదము.

ఈపత్రికకుఁ జందా సంవత్సరమునకు (12 సంచికలకు) తపాలాఖర్చులుగాక } రు 3—0—0 లు మాత్రము.

విడిగఁ బ్రతిసంచికకు (తపాలాఖర్చులుగాక) రు 0-6-0 లు.

ప్రస్తుతము కొలఁదిప్రతులే ప్రచురింపఁబడుటచేత వలయువారు శీఘ్రముగ

'అద్దంకి మాధవశాస్త్రిగారు,
'ఆంధ్రసేవా' పత్రికాధిపతి,
పిఠాపురము, గోదావరిజిల్లా'

అని వ్రాయవలయును.

రిజష్టరునంబరు ఎమ్. 1287.

శ్రీ

# ఆంధ్రసేవ

మా స ప త్రి క.

ప్రతిమాసాదిని వెలువడును.

| ప్రథమ వర్షము. | డిశంబరు 1917. | సంచిక 6. |
|---|---|---|

శ్లో. వితరతిగురుః ప్రాజ్ఞే విద్యాం యథైవ తథాజడే
నచఖలు తయోర్జ్ఞానే శక్తింకరోత్యపహంతివా
భవతిచతయోర్భూయాన్భేదః ఫలం ప్రతితద్యథా
ప్రభవతి శుచిర్బింబగ్రాహే మణిర్నమృదాదయః.

(ఉత్తరరామచరితనాటకము.)

## గ్రంథస్వీకారము.

1. పీఠికాపురవాసులు నభినవకాళిదాసుఁడని ప్రసిద్ధిఁగాంచిన మ.రా.రా. శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారిచే రచింపఁబడిన ‘‘కంఠాభరణ’’ మను 209 పుటలును రు 0—12—0 వెలగల హాస్యరసప్రధానమగు నాటకమును, 320 పుటలు గల్గి రు 1—0—0 కిమ్మతుగల ‘‘కథాలహరి’’ యనుపొత్తమును మాపత్రికాకార్యాలయము నలంకరించినవి. మాపత్రికయందలిదయ

చేఁ బైపొత్తములనొసఁగినందులకు శ్రీపంతులవారి కీపత్రిక మిగులఁ గృతజ్ఞతగలదియై యున్నది. ఈకవిశిఖామణి యనేక దృశ్య, శ్రావ్య గ్రంథముల రచించి పేరుగాంచినవారలగుటచే నీగ్రంథములయందలి శైలి, పాత్రపోషణము, కథాకల్పనము మున్నగునవన్నియు మానవ మానసోత్సాహాకరములని వేరె వక్కాణింపనవసరము లేదు.

2. గంజాంమండలాంతర్గత ఛత్రపురములోని యాంగ్లేయ మహాపాఠశాలాపండితులగు మ.రా.రా.శ్రీ భాగవతుల నృసింహశర్మ గారిచే రచింపఁబడిన "విజయవిజయము లేక కర్ణవిక్రమ" మను 131 పుటలును రు 0—10—0 వెలగల వీరరసప్రధానమగు నైదంక ములనాటకము మాకార్యాలయము నలంకరించినది. దయచేఁ బై పొత్తము నంపినందులకు శ్రీనృసింహశర్మగారి కీపత్రికాముఖమునఁ గృతజ్ఞతఁ జూపుచున్నారము. ఇందలి శైలి ప్రౌఢముగనుండుటచే జన సామాన్యమునకు సులభగ్రాహ్యముగాకున్నను వీరరసప్రధానమగు టచే నటులుండుట సమంజసము. ఇందు రసపోషణము, పాత్రపోషణ ము మున్నగునవి బాగుగ స్ఫుటీకరింపఁబడినవి. ఈగ్రంథమునకు మ.రా.రా.శ్రీ మండపాక పార్వతీశ్వరశాస్త్రి బి.ఏ. గారు విపులము గా విమర్శనము వ్రాసియున్నారు. కావున మఱల విమర్శనముఁ జేయు ట యవసరములేదని విరమించుచున్నారము.

ఆంధ్రసేవ దినదినాభివృద్ధిఁ గలిగి చిరకాలము విహితకృత్య ముల నెరవేర్చుగాత. ఆంధ్రసంఘము తత్కార్యనిర్వహణమున మిగు ల సౌఖ్యమునంది యుచ్చపదవి నందెడుగాత.

మంగళంమహత్.

శ్రీ శ్రీ శ్రీ.

లనయెడలఁ గోపోద్రిక్తుఁడై యున్న సమయమున నాతఁడు స్థిమితముగ నాలోచించుచుండును. ఒక్కొక్కప్పుడు క్రౌర్యస్వభావమును వ్యక్తపఱచు నాటవికునివలెఁ గాన్పించి మఱియొకప్పుడు దేశోద్ధారణమునిమిత్తము బోధచేయు బోద్ధవలె నౌదార్యముగలిగి విశాలహృదయుఁడుగఁ గాన్పించును. ఏభావమువ్యక్తపఱచిన నాతని కాతఁడే సాటి యనునట్లుండును.

ఆతనిస్వార్జితములలో శాశ్వతమైనవి రెండుగలవు. అందు మొదటిది యధికారము. ఈయధికారబలమునే యలగ్జాండరు తండ్రివలెను నాతఁ బెద్దరాష్ట్రమును బలపఱచుటలో వినియోగించెను. గ్రీసుదేశములోని జనులనందఱ నేకీభావమునొందునటులఁ జేయవలయుననెడి యూహ యాతని రెండవయార్జితము. ఈరెండే యాతనియాధిక్యమునకుఁ గారణములు. అంతియేకాదు. మానవరంజకత్వము, చురుకుదనము క్రమపద్ధతి నేర్పాటుచేయునేర్పు, వివేకముతోఁగూడిన బుద్ధిచాతుర్యము కలిసి యాతనికిఁ గౌరవపదమునిచ్చెను.

## రెండవప్రకరణము.

(అలెగ్జాండరుయొక్క బాల్యము.)

గ్రీసుదేశములోని ధనికులందఱును దమపిల్లలను దాదులకొప్పగించి కొంతకాలమువఱకు నాదాదులసంరక్షణములోనే యుంచుట పూర్వాచారమై యుండెను. ఆయాచారప్రకార మలెగ్జాండరుకూడ “లానిస్” (Lanice) అనునొకదాది కొప్పగింపఁబడెను. ఆతఁడాదు

వత్సరముల బాలుఁడగువఱకు నామెసంరక్షణమునసే యుండుటచే నామెయొద్దఁ జనవెక్కువయి తనజీవితకాలమంతయు నామెను దల్లి వలెనే ప్రేమించుచుండెను. ఆమెకొడుకులలోఁ దనకు సవయస్కుఁ డొకఁడు తనతోఁగూడ నామెవలనఁ బెంపఁబడుటచేఁ గలిగినస్నేహ మును బెద్దవాఁడగువఱకును మఱచిపోవక యప్పుడుగూడఁ దనయా ప్తమిత్రులలో నొకనిగ నాతనిఁ బ్రేమించుచుండెను. ఆమెయొక్క యితరపుత్రులందఱును యుద్ధములలో నలగ్జాండరుపక్షమునఁ బోరు చుఁ బ్రాణములఁ గోలుపోయిరి. ఈవిధముగ నలగ్జాండరు తన పెంపు డుతల్లియెడలఁ గృతజ్ఞుఁడై యుండుచున్నను నాతనికి మచ్చఁదెచ్చు నొకనేర మాతఁడామెయెడలఁ జేసెను. ఆమెసోదరుఁడైన క్లిటస్ (Clitus) ఒకపరి యలగ్జాండరుయొక్క ప్రాణమును గాపాడెను. తన పెంపుడుతల్లియొక్క సోదరుఁడనియైనఁ దలఁపక, తనప్రాణములను ర క్షించినదాతయనియైనను జ్ఞాపకముంచుకొనక యొకసారి త్రాగి మ త్తిల్లి యున్నప్పుడు కలహము పెట్టుకొని యాతనిఁ జంపివేసెను. కాని వెంటనేస్మృతిఁదెచ్చుకొని పశ్చాత్తాపమునుబొంది 'లానిస్,, 'క్లిటస్' లపేరుల గట్టిగానుచ్చరించుచుఁ గన్నీటితో నీవిధముగ విలపింపఁజొ చ్చెను :—

''నాబాల్యమున నీవునన్నుబెంచినందులకును నీయొక్కరక్షణ మునకును నాయౌవనమున నీకుమారులు నాకై ప్రాణముల నర్పించి నందులకును బ్రత్యుపకారముగ నేనుబెద్దవాఁడనై నీసోదరుని నాచేతు లతోఁ గడతేర్చితిని. ఎంతమంచిప్రతీకారము''

గతజలసేతుబంధనమేల? త్రాగుడెంతవారిచే నెట్టిపనులను జేయించునో!

ఆఱువత్సరములాతఁడు సభలలోనికిని బురుషులలోనికిని రాక

యంతఃపురములలో స్త్రీజనమధ్యముననే కాలమునుబుచ్చెను. ఆతఁడీదినములలో బాలురందఱివలెనే యాటలపాటలతోఁ గాలముఁబుచ్చుచుఁ బురుషులసాంగత్యములేక మెలఁగుచుండెను. ముఖ్యముగాఁదనతండ్రియుద్ధముచేయుదినములలో నాతఁడాయుద్ధములసంగతి యేమియు నెఱుఁగకయుండెను. ఆతఁడాకాలములోఁ దనతల్లియొద్దనేయుండుటచేఁ దల్లిగుణములే యనేకము లాతనికలవడెను. అందుముఖ్యముగా మతావేశమూ మెవలననే యాతఁడు నేర్చుకొనెను.

సప్తమవత్సరము మొదలు ద్వాదశవర్షపూర్తియగువఱకును, అలగ్జాండరు 'లియోనిదాసు' (Leonidas) అనునాతని శిక్షయందుండెను. ఈవిద్యాపద్ధతినిగుఱించి గ్రీకులలోని యొకయాచారమును దెలుపవలసియున్నది. సర్వసామాన్యముగా నాదేశములోని ధనికులబాలురను పాఠశాలకుఁబంపువయసు వచ్చుటతోడనే యొకగౌరవమైన బానిసతో జతచేసి పాఠశాలకుఁ బంపుదురు—ఆకాలములో గ్రీకుదేశములో బానిసలు మిక్కుటముగ నుండెడివారు—ఈబానిస విద్యార్థికంటె వయసునఁబెద్దవాఁడును నమ్మకమైనవాఁడును, విద్యయందల్పప్రజ్ఞగలవాఁడును, విద్యార్థికి మర్యాదలక్షణములను దెలిపి యాతని నల్లరిచేష్టలనుండి విముఖునిగఁ జేయువాఁడును నై యుండును. ఈతఁడు బాలుఁడెచటకుఁబోయినను వెంటఁబోవుచుఁ బాఠశాలకుఁ బోవునప్పుడాతని చిన్నచితారు (Musical instrument) పుస్తకములు, వ్రాఁతపలక మొదలయినవానినిఁ బట్టుకొని వెంబడించి పాఠశాలముఁగియువఱకుఁ గనిపెట్టుకొనియుండెడివాఁడు. ఈతనిని 'పెడగాగ్' (Peda-gogue) అని వారుపిలుచుచుండెడివారు.

అలగ్జాండరువిషయమున నొకమార్పుగలిగెను. 'లిసిమేకస్' (Lysimachus) అనునొకఁడు సర్వకాలసర్వావస్థలయందు బాలునిఁ

గని పెట్టుకొనియుండి పైనఁజెప్పఁబడిన పనులనన్నిఁటిని నెరవేర్చుచుండెను. లియోనిదాసుగూడ 'పెడగాగ' నుపేరును వహించుచుండెను గాని యాతఁడే బాలునియొక్క గురువు. ఆతఁడున్నతవంశసంజాతుఁడగుటయేకాక బాలునికిఁ దల్లివైపున బంధుత్వమునుగూడఁగలిగియుండెను. సత్కులీనుఁడును విద్యాసంపన్నుండు నగుటచే నాతనికిఁ బైనఁబేర్కొనఁబడిన నామముగాక విద్యాగురువు (Educator) పండితుఁడు (Professor) నను నామములుగూడ నుండెడివి.

శిష్యులను శిక్షితులఁజేయుటలో లియోనిదాను మిక్కిలికఠినుఁడు. అందువలన నలగ్జాండరు మిక్కిలికష్టములకోర్చుకొనుటయు సౌఖ్యలోలుఁడు గాకుండుటయుఁ దటస్థించెను. ఇందులకుఁ దార్కాణముగ నొకచిన్నయుదాహరణమును దీసికొనవచ్చును. సాధారణముగ నలగ్జాండరు మితముగ భుజించెడివాఁడు. అతఁడు మాతృభావముతోఁ జూచుచున్న 'ఆదా' యనునొకస్త్రీ పలుమారాతనికి వివిధములగు రుచ్యపదార్థములను బంపుచుండెను. ఆమెకుఁ దృప్తితీరక ప్రతిదినము ను బదార్థములను బంపుటకంటె మిక్కిలినేర్పరులగు వంటవాండ్ర నొకసారిపంపెను. అందుపై నలగ్జాండరిటులఁ బ్రత్యుత్తరమంపెను.

"అమ్మా! నాకు వీరియగత్యము లేదు. మాగురువైన లియోనిదాసు నాకు వీరికంటెనుత్తమమయిన వంటవాండ్రను బ్రసాదించి యున్నారు. ప్రాతఃకాలభోజనమునకు 'రాత్రియంతయు శరీరపరిశ్రమచేయుట' యనునదియు మధ్యాహ్నభోజనమునకు 'ప్రాతఃకాలమున నల్పాకలిగభోజనముచేయుట' యనునదియు నాకిదివఱకేయున్నవి. అంతకంటె మంచివంటవాండ్రు నాకవసరములేదు. ఇంతయేల అప్పుడప్పుడాయన నాబట్టలపెట్టెలను దెఱచి యందునాకనవసరమైన పదార్థములనేమైన మాయమ్మ యిచ్చినదేమోయని వెదకుచుండెడి

వారు. కావున నాకిట్టివానితో నవసరములేదు."

లియోనిదాసు చిన్నచిన్న విషయములలోఁగూడ నతిశ్రద్ధఁ బూనెడివాఁడు. అలగ్జాండరు స్వభావసిద్ధముగ దూబరా (Lavishness) గలవాఁడు. దానిని తగ్గించుటకు లియోనిదాసనేకసారులు ప్రయత్నముచేసెను. ఒకానొకసారి యాబాలుఁడు హోమకుండమునందు సాంబ్రాణిమున్నగు సుగంధద్రవ్యములను రెండుచేతులతో వేయఁబోవుచుండగా గురువాతనివారించి "నీవుముందు నూతనదేశములను జయించినప్పు డాదేశములలో సుగంధద్రవ్యములున్నయెడల స్వేచ్ఛగా నీయిష్టమువచ్చినటుల హోమముఁ జేయవచ్చును. ప్రస్తుతము నీకున్నదానితో జాగ్రత్తగఁ గాలమును బుచ్చుము." అనిహితబోధ యొనర్చెను. ఈమాటను జ్ఞప్తియందుంచుకొని యలగ్జాండరు పెద్దవాఁడై నూతనదేశములను జయించినప్పుడచటినుండి యనేకటన్నుల సుగంధద్రవ్యములను గురువునకుఁ గానుకగాఁబంపి "అయ్యా! తమయాజ్ఞానుసారము పూర్వము సుగంధద్రవ్యములను స్వల్పముగావాఁడితిని. ఇప్పుడు తమరు భగవంతునారాధించుసందర్భమునన్తైనను మితముగనుండవలెననుమాట మరచిపోయి మనసుదీర మీాయిచ్ఛవచ్చినంత హోమమును జేసెదరుగాక!" యని తెలియఁబఱచెను.

కాని పైనఁజెప్పఁబడినటుల లియోనిదాసు ప్రతిచిన్నవిషయమునందును జండశాసనుఁడై యుండవలెనను నూహతోఁ దనకాఠిన్యమును సహజముగనుండవలసినదానికంటె నెక్కుడుగఁజూపుచుండెను. అందుచే నాతనిశిష్యుఁడైన యలగ్జాండరునకును నాతనిగుణములుకొంతవఱకలవడి పెద్దవాఁడైనతర్వాతఁ గాఠిన్యమును, గర్వమును, నిరంకుశాధికారమును నుండునట్లుగాఁ బరిణమించెను. తాను నిరంకుశాధికారమును బొందవలెనను కుతూహలముగలవాఁడేకాని యితరులయం

దట్టిగుణముండినయెడల నాతఁడెంతమాత్రమును సహించువాఁడుకాడు ఈగుణము నాతనితండ్రి కనిపెట్టి తనకుమారుఁడు మంచిమాటలచే నచ్చఁజెప్పినయెడల వినువాఁడుగాని దండనమునకు వెఱచువాఁడుగాడని గ్రహించి యాకాలమునందు మహాపండితుఁడని ప్రసిద్ధిఁజెందిన 'ఆరిస్టాటిల్' (Aristotle) తనకుమారునకుఁ దగినగురువని గ్రహించి యాతనిబిలిపించెను. బాలునకుఁ బదమూఁడవవత్సరము వచ్చినప్పటినుండియు నారిస్టాటిలే యాతనికి గురువు. ఈగురువునొద్ద నలగ్జాండరేమినేర్చుకొనెనో ముందుముందుఁ దెలిసికొందుము.

అలగ్జాండరు బాలుఁడుగానున్నప్పుడు నయితము మిక్కిలిచురుకుదనముఁగలిగి భయమనుమాటనెఱుఁగక యితరులు చెప్పిన మాటయందెంతమాత్రమును లక్ష్యములేనిస్వతంత్రాభిప్రాయములు గలవాఁడుగనుండెను. అట్లనుటవలన నాతఁడు తాఁబట్టినకుందేటికి మూఁడేకాళ్లనునట్టి మూర్ఖుఁడని భావింపఁదగదు. సహజముగ బుద్ధిచాతుర్యముగలవాఁడై తెలివితేటలయందును గార్యాచరణమునందును నాతఁడు పరాపేక్షలేనివాఁడుగ నుండెను. ఆతనిచురుకుదనమునకును బుద్ధిచాతుర్యమునకును దార్కాణముగ నాతనిపండ్రెండవయేటజరిగిన యొకచిన్నవృత్తాంతమును దెలుపవచ్చును.

థేసాలీ (Thessaly) దేశములోని యొకమనుజుఁడు 'బ్యూసిఫేలస్' (Bucephalus) అనుతనగుఱ్ఱమును ఫిలిప్పునకు నలుబదిమూడువేలరూప్యములకుఁ బైగా నమ్మకమునకుఁ బెట్టెను. అప్పుడు రాజును కుమారుఁడైనయలగ్జాండరును పరివారమును గుఱ్ఱమునుబరీక్షించుటకై యూరిబయటకు వెడలిరి. ప్రథమవీక్షణముననే యదినిరుపయోగకరముగను నిరుత్సాహకరముగను గన్పట్టెను. అది యెవ్వరినెక్కనీయకుండెను. ఫిలిప్పుయొక్క సేవకులేరును దానిని లొంగఁదీ

యలేకుండిరి. ఫిలిప్పు విసుగుదలజనించి యదియడవిగుఱ్ఱమని భావించి దానినిదీసికొనిపొమ్మని యాజ్ఞాపించెను. అంతటఁ జెంగటనున్న యలగ్జాండరు మెల్లగాఁదండ్రితో నిట్లులనియెను. “వారందఱును దానినెక్కుటకుఁ జాతుర్యముగాని ధైర్యముగాని లేనివారగుటచే నట్లనుచున్నారుగాని నిశ్చయముగా నదియట్టిదికాదు.”

ఫిలిప్పు మొదట నీమాటలను బెడచెవినిబెట్టెనుగాని మఱలమఱల నీబాలుఁడు పలుకుటఁజూచి మొగమెఱ్ఱవార “పెద్దలనట్లధిక్షేపించుట యేటిన్యాయము! వారికంటెనీకేమైన నెక్కువ తెలియుననుకొంటివా?” యని మందలించెను. అందులకు బాలుఁడు మెల్లఁగా “మీరునన్ను దగ్గరగా వెడలనిచ్చినయెడల నీగుఱ్ఱమును లోఁగఁదీయుటలో మాత్రము నేను వారికంటెనెక్కుడుచాతుర్యమును జూపఁగలను.” అనిప్రత్యుత్తరమిచ్చెను.

“నీవులోఁగఁదీయకపోయినయెడల శిక్షగానేమియిచ్చెదవు?” అని తండ్రిప్రశ్నించెను.

“దీనికంతయాలోచనయెందులకు? గుఱ్ఱముయొక్క మూల్యమునిచ్చివేసెదను.” అనిబాలుఁడు జవాబుచెప్పెను.

ఈసమాధానమున కచటివారందఱును పక్కుననవ్విరి. తరువాతఁ గొలఁదికాలము మూల్యమువిషయమై తగవులాటజరిగినతర్వాత బాలుఁడు గుఱ్ఱముదగ్గరకువెడలి కళ్లెమునుబట్టుకొని దానిముఖమును సూర్యునివైపునకుఁ ద్రిప్పెను. అంతవఱకు నాగుఱ్ఱము సూర్యునికి వెనుకఁదిరిగి నిలుచుండెను. అందుచేతనది తననీడనేచూచుకొని బెదరి యెందఱుపట్టుకొన్నను వినకుండెను. అలగ్జాండరు గుఱ్ఱముయొక్క ముఖమును సూర్యునివైపునకుఁ ద్రిప్పుటలో దానినీడ దానికిఁగానిపించకుండునటులఁజేసి దానిబెదరును దీర్చవలయునని యాతనియుద్దేశము.

ఆతఁడు మెల్లగా దానిని తట్టుచు దానితోఁ గొంతదూరము పరుగిడి యుదియుత్సాహమును బొందినదని తోఁచినతోడనే పైనున్న కోటును దీసి పారవైచి యొక్కదుముకుతో దానిపై నధిష్ఠించెను. అటుతరువాత దానిని గొట్టక బెదిరించక మెల్లగాఁ గొంతదూరము పోనిచ్చి బెదరు తీరి యుంకించుటకుత్సహించుచున్నదని తోఁచినతోడనే దానిని బోనిచ్చి పెద్దకేకవైచి కాలితో నొక్కతన్ను దన్నెను. అంతనా హయము నిండువేగముతోఁ బరువిడెను. అంతవఱకు నత్యాతురతతో నిశ్శబ్దముగానున్న సమూహమునం దాతఁడా యశ్వమును మరల్చి సగర్వముగనున్న సంతోషలక్షణములు ముఖముపైఁ బొడఁగట్ట వెనుకకు వచ్చుటతోడనే యొక్కమారు సంతోషారావములు మిన్నుముట్టెను. అట్టిసమయమునఁ దండ్రికి జనించుసంతోషమును వర్ణించుట యెరితరము? అతఁడానందబాష్పములతో సుతునిమూర్ధమును బుడికించి ముద్దాడెనని వర్ణించుట బాహ్యలక్షణములను దెలుపుటయే కాని యాంతరంగికసంతోషమును బూర్తిగ వర్ణించుట యగునా? అతఁడిట్లుపలికెనఁట “తండ్రీ! ఈ మేసిడోనియా నీకుఁజాలదు. నీకుఁదగిన పెద్దరాష్ట్రమును నీవుసంపాదించుకొమ్ము.”

అన్యునియందలి యాధిక్యమును మాత్సర్యములేనియనురాగముతోఁ బొగడి నిశ్చయమైన ప్రేమను సంతోషమును జూపుట తండ్రికిగాక యన్యులకు సహజమగునా?

ఇట్టులన్యులకు స్వాధీనముగాక యాతనికిమాత్రమే లోఁబడుటయు నాయశ్వము మిక్కిలిప్రశస్తమయినదియు నగుటచే నది బ్రదికి యున్నంతకాలమును అలగ్జాండరు దానిని వదలిపెట్టక దానియందత్యంతానురాగమును జూపుచుండెడివాఁడు. ఆతనియనురాగమును సూచించుటకు రెండుదృష్టాంతములను జూపవచ్చును.

మెసపొటేమియా (Mesapotamia) లోని తూర్పుభాగమున నితఁడు విడిసియున్నప్పు డాయశ్వము తప్పిపోయెను. అందుపై నలగ్జాండ రొకప్రకటనముం బంపెను. తనయశ్వము నాదేశీయులు తెచ్చి యీయకపోయినయెడల నాభాగములోని జనులనందఱను జంపివైచెదనని యాప్రకటనమున నాతఁడు తెలిపెను. అందులకు ఫలితముగ వెంటనే యాయశ్వమును వారు తెచ్చియిచ్చివైచిరి. ఈచిన్నయంశము విదేశీయులకు నలగ్జాండరుయందుఁగల భయమును, అలగ్జాండరునకుఁ దనయశ్వమునందుఁగల యనురాగమునుగూడ సూచించును.

అతనియనురాగమును సూచించు రెండవకథ యిటులుండెను హిందూదేశములోఁ బురుషోత్తమునితో యుద్ధము పూర్తియైనవెంటనే యాహయము కాలధర్మమునొందెనఁట. అలగ్జాండరునకు దుఃఖము మితిమీరి యదిమృతినొందినస్థలమున దానిపేరట నొకపట్టనమును గట్టి ‘బ్యూసిపేలా’ (Bucephala) యని దానికిఁ బేరిడెను.

పైయనురాగాదిగుణములే కాక నిరంతరము నేదియోయొకటి చేయుచుండవలెనను కుతూహలముగూడ నాతని బ్రోత్సహించుచుండెను. అందువలన నెంతటికష్టకార్యమునకైన నాతఁడు వెనుకంజవేయక సందిగ్ధసమయములఁగూడ నేదికర్తవ్యమో సునాయాసముగ నిర్ణయించుకొని యటులవెంటనే కావించుకొనుచుండెడివాఁడు. కార్యాచరణమునం దాతనికున్న యావేశమును దెలిసికొనుట కేరికిని సాధ్యముగాదు. ఆతనిస్వభావమును సరిగఁ దెలిసికొనుట కాతఁడు సవయస్కులగు తోడిబాలురతోఁ జెప్పినక్రిందివాక్యములఁ జూచినఁ దెలియనగును. తండ్రియేదేశమునైన జయించినవార్త వినినతోడనే యాతఁడిట్లనును.

“ స్నేహితులారా! నాయనగారన్నిదేశములను దామే జయిం

చుచున్నారు. నేను పెద్దవాఁడనైనతర్వాత మీతోఁగలిసి జయించుట కేమైన దేశముల నాయన వదలిపెట్టునో లేదో !"

కావునఁ దండ్రియొద్దనుండి సామాన్యపుబాలురవలె ధనమును రాజ్యములను సౌఖ్యములను గాక యుద్ధములను కష్టములను దనకు వారసత్వముగా రావలెనని కోరుబాలుఁడు లోకాతీతుఁడుగాఁడా? బాల్యమునందట్టిగుణములఁ గనఁబఱచినవాఁడు వయసువచ్చినతర్వాత మహాకీర్తినిగడించుట యాశ్చర్యమా?

ఆతనిభావ్యౌన్నత్యసూచకములగు బాల్యమునందలికథలలో మఱియొకదానినిగుఱించి వినినయెడలఁ బైదానికంటె నెక్కుడుగ నాతనియాధిక్యమును దెలిసికొనుట కవకాశము గలుగును. ఒకానొకపుడు తనతండ్రియాస్థానమునకుఁ బారసీకమునుండి రాయబారు లేతెంచిరి. తండ్రియూరలేకపోవుటచే వారికిఁగావలసినవానినన్నిఁటిని దెప్పించుటకై బాలుఁడైనయలగ్జాండరు వారితోనుండవలసివచ్చెను. ఆతఁడు వారియెడలఁజూపిన గౌరవమునకును, ఆతఁడొనర్చిన సత్కారమునకును వారుమిక్కిలిసంతసించి యాతఁడుబాలుఁడైనను ఆతనితో సంభాషణమునకుఁ బ్రారంభించిరి. ఆసంభాషణమునందు వారుమనసునిచ్చి మాటలాడుటఁగనిపెట్టి సామాన్యమైనబాలురవలెఁగాక యీ క్రిందవివరింపఁబోవు విషయములఁగూర్చి యాతఁడు వారిని బ్రశ్నించెను.

"పారసీకదేశములోని బాటలపొడుగును, దేశములో నొకభాగమునుండి మఱియొకభాగమునకు వెడలుటకుఁదగిన ప్రయాణసౌకర్యములును, ఆదేశనేతయైన 'షా' యెటువంటివాఁడో, యాతఁడు పరాక్రమవంతుఁడగునో కాదో, యాతనిసైన్యమెంతయున్నదో, యాతని రాజ్యమునకు ముఖ్యమైనబలముగల యాయుధపట్టులెచటనున్నవో."

# ఇద్దరు దొంగలు.

రాజు—ఏమి! ఈమధ్య చిత్రవిచిత్రములగు దుండగము లనేకములు వినుచుంటిని. అవినడపించుచుండిన మహారాష్ట్రపుదొంగవు నీవేనా?

దొంగ—నేనుమహారాష్ట్రుడను. శూరవంశ్యుడను.

రాజు—శూరవంశ్యుడ, చోరుడ, బందిపోటరి, ప్రాణఘాతక, దేశక్షేమమునకు వేరుపురుగువైతివిరా. నీసాహసముచూడ మెచ్చవచ్చినవాడయ్యును నీచేయునేరములు నుపద్రవములును నిన్ను మన్నింపనీయకున్నవిగదరా!

దొంగ—నన్నింతగాదూరుటకు మీకేమియపకార మొనర్చియుంటినో తెలియకుంటిని.

రాజు—నాయధికారము నొకమూలఁబెట్టుమని దేశమునల్లకల్లోలముచేయుచు తోడిప్రజప్రాణములకు, విత్తములకు నుపద్రవమాపాదించుచు విచ్చలవిడి విహరింపుచుండియు నింకనీయద్దుప్రశ్నయేల?

దొంగ—రాజా! దొరకిపోతిని, నీచిత్తమునకుఁ బాత్రుఁడను. నీశిక్షకు బద్ధుడను. ఐన నాకాలుసేతులు మీకులొంగినవేకాని నాధైర్యమున కేమిలోపము? మీమాటల కేదేనిప్రత్యుత్తర మీయఁగోరుచుఁరేని స్వతంత్రించి చెప్పువాఁడనుకాని మఱియొకటికాదు.

రాజు—కావలసినంత స్వేచ్ఛగా మాటాడుము, నాయధికారమువలన భయమువలదు. నీవేమిచెప్పికొందువో నేనువినవలతును.

దొంగ—నీప్రశ్నకు నాదొకమారుప్రశ్న. కోపింపకుము. నీరోజులను నీవెట్లుగడపుచుంటివి?

రాజు—వీరాగ్రేసరునివలె నాదినములను గడపుచుంటిని. కీర్తికాంత నడుగుము. ఆమె నా పేరు దశదిశల మ్రోగుచున్నదనకుండునా? ధైర్యవంతులలో ధీరతముడ ననిపించుకొంటిని. రాజుల రాజాధిరాజు ననిపించితి. జయశీలురలో సాటిలేనిమేటి ననిపించితి.

దొంగ—ఏమి? కీర్తికాంత నాయెడలమాత్ర మూరకుండునా? నాకంటె ధైర్యవంతుడగునాయకుని నేర్పరిని నాపరిజనముకంటె సాహసముగలమూకలను నీవిదివఱలో కనియుంటివా? వినియునైననుంటివా? ఏకాలమందైనను—ఏదేశమందైనను—ఏల, స్వోత్కర్ష నీచము. అందుకుఁ జొరజాలను. నేను సాధారణముగఁ బట్టువడకుంటినని నీమట్టుకు నీకే తెలియునుగదా?

రాజు—వేయిచెప్పుము, లక్ష చెప్పుము. చోరుడవుకాని మఱియొకటికాదు. నీచుడవును అన్యాయప్రవర్తనుడవును.

దొంగ—నీజయశీలత్వమున కేమియర్థము? పెనుభూతమువలెనెక్కడచూచినను నీవెయయి దేశమందు శాంతి లేశమైనను లేకుండఁజేయుచుఁ దిరుగాడుచుండుట లేదా? తీరనిరాజ్యకాంక్షచే దయలేక, దాక్షిణ్యము లేక, న్యాయమువదలి దేశములు కొల్లగొట్టలేదా? జనక్షయ మొనర్పలేదా? నేనొక్క నూరుమంది పరివారముతో నొకతాలూకానో, జిల్లానో, యొనర్చినపనిని తాము నూరువేలసిబ్బందితో నడచి రాజ్యములు రాజ్యములు ధ్వంసమును జేసిరి. నేనిక్కడ నొకమనుష్యుని నడ్డుకొట్టితినేకాని మీరెండఱిరాజులనో రాజకుమారులనో రూపుమాపిరి. నేనిక్కడనక్కడ కొన్నిగ్రామములకు చిచ్చుపెట్టితినో లేదోకాని మీరు ధనధాన్యములతోఁగూడ భస్మీభూతములుగావించిన పట్టనములకు రాజ్యములకు మేరయెక్కడిది. ఇఁక తమకునునాకును గలభేద మేమిటిది. బొడ్డున మాణిక్యము పెట్టికొని యొక రాజకుటుంబ

మున తామువయింప నేనేదోయొకగుడిసె జనించినమాత్రముననేకదా నాకంటె పెద్దదొంగ యనిపించుకొనఁగలిగితిరి.

రాజు—ఓయీ! నేనొక రాజువలె గ్రహించి రాజువలె నిచ్చుచుంటిని. రాజ్యములు తలక్రిందులుచేసిన సంతకంటెను గొప్పవి స్థాపింపఁగలిగితి. వాణిజ్యమేమి; కళాజ్ఞానమేమి, శాస్త్రములనేమి, యన్నిటినో బోషింపుచుంటిని.

దొంగ—నేనునట్లె. భాగ్యవంతులను జెఱచి బీదలను బోషింపుచుంటిని. గురువునై, దేవునై, యను శుద్ధక్రూరస్వభావులగు మూర్ఖులకు బుద్ధిగఱపి నామాటయందు వారికి గౌరవప్రపత్తులు కలుగఁజేసితిని. దీనుల కభయహస్తమొసగితిని. తామువచించు శాస్త్రజ్ఞానకళాజ్ఞానముల సారమెఱిఁగినవాఁడఁగాను కాని జనులనుఘోషపెట్టి దేశము నిర్ధూమధామము చేయుటలో మనమిద్దర మన్నదమ్ములమే. మనమొనర్చినధ్వంసమున కెన్నిశతాబ్దములైనను ప్రపంచమున కుపకారముచేయుదుమన్నమాట యీజన్మములోనిమాటకాదు. చిత్తగించినఁ దమకే విశదము.

రాజు—పొండు. కొనిపొండు. బంధములూడ్చి యాదరింపుడు. (తనలో) మేమిద్దరమొకటియా? మహారాజునకు, గజదొంగకునా, సామ్యము—ఆలోచింపవలసినవిషయమె.

*Wanted*

Agents to 'ANDHRASEVA' a Telugu educational monthly journal.

Liberal commission granted.

*Apply stating terms to*

*The Editor*

ANDHRASEVA

**PITHAPURAM.**

*Godavary Dt.*

## వ్యవసాయశాస్త్రప్రాముఖ్యము.

మనలోఁ జాలమందికి వ్యవసాయ మొకగొప్పశాస్త్రమనియు దానినభ్యసించుట గొప్పకష్టమనియుఁ దెలియకపోవుటయేకాక విద్య యననేమియో తెలియనివారుసహితము బహుసులువుగా జేయువ్యవ సాయ మొకశాస్త్రమాయని నిరసించుచున్నారు. వేలకొలఁదిసంవత్స రములనుండి పరంపరగా వచ్చుచుండుటచే నందలికష్టములు తెలియ వుగాని మామూలు కొంచెముతప్పిన నేమిచేయవలయునో తెలియక తొట్రుపడుచున్నారు. వ్యవసాయశాస్త్రజ్ఞానము కొంచెముగలిగి యందుత్తీర్ణులైనవారిసాహాయ్యముచే జర్మనీ, ఇంగ్లాండు, అమెరికా మొదలగుదేశములవారు భూమిని దమస్వాధీనముఁజేసికొని శాస్త్రజ్ఞు లు చెప్పినచొప్పునఁ జేయుచు మహదైశ్వర్యసంపన్నులై యున్నారు. మనదేశీయులుగూడ వ్యవసాయమున నూతనపద్ధతుల నవలంబించి విశేషలాభమును బడయుదురుగాత.

వ్యవసాయశాస్త్రమనునది యనేకవిధశాస్త్రములుగలిసిన యొ కగొప్పశాస్త్రము. ఆశాస్త్రము లేవియనఁగా వ్యవసాయశాస్త్రము, వాయుమండలశాస్త్రము, ప్రకృతిశాస్త్రము, శిల్పశాస్త్రము, ఖనిజ శాస్త్రము, రసాయనశాస్త్రము, ఓషధిశాస్త్రము, క్రిమిశాస్త్రము, ఓషధివైద్యశాస్త్రము, పశుచికిత్సాశాస్త్రము అనునివిప్రధానములు. ఇందొక్కొకశాస్త్రమునకు నందలిమహావేత్తలు పరిశోధనల గావిం చి తన్మూలమున సృష్టిరహస్యములనరసి లాభముల బడయుచున్నారు ఇంతబహుళతయు నింతకష్టమును వ్యవసాయమున లేకున్ననేమని కొందఱనవచ్చును. అదిపొరపాటు. ఏలయన ప్రపంచమున జనసం

ఖ్య రానురాను హెచ్చగుచున్నది. అందులకుఁదగినట్లు భూమిగూడ హెచ్చయినచో సరిగనుండును. అటులగాక పదివేలసంవత్సరముల క్రిందట భూమి యెంతయుండెనో యిప్పుడుకూడ నంతేయున్నది. వృద్ధియగుచున్న జనసంఖ్య కాహారమేది? ఎక్కడనుండివచ్చును? భూమి మునుపటికంటె నెక్కువరెట్లు ఫలించునట్లు చేయుటవలననేగదా జనులకావశ్యకమగు నన్నవస్త్రముల కిబ్బందిలేకపోవును. భూమి నెక్కువగా ఫలింపఁజేయుట కందులకుగలకారణముల నరసి తగినయేర్పాటులఁ జేసినగాని ఫలించదు. అట్లుఫలించుటకు శాస్త్రాభ్యాసములఁజేసి సృష్టిరహస్యములఁ గనుఁగొనవలసియున్నది. శాస్త్రజ్ఞులు ప్రతిదేశమందహోరాత్రము లెడతెగక పరిశోధనల గావించుచున్నారు. అప్పుడప్పుడు పరమరహస్యములఁ గొంచెముకొంచెముగా గనుగొని వానిమూలమున దేశసేవ చేయుచున్నారు. సృష్టికర్తయొక్క రహస్యవిధానముల గనుఁగొనుట మిక్కిలి కష్టసాధ్యము. అయినను ప్రస్తుత శాస్త్రవైదగ్ధ్యమును, దానియభివృద్ధియుఁ జూచిన మానవబుద్ధికుశలత లేశముగాదనియు దానికసాధ్యమగునది లేదని తోచకమానదు.

ఇఁక పైనఁజెప్పఁబడిన శాస్త్రము లెట్లుపయోగకరములో యొక్కొకటిగాఁ బరిశీలించెదము.

వ్యవసాయము—ఇందు పొలముసాగుచేయువిధములు చులకనబరువునగునాగళ్లతో దున్నుటవలనఁ గలిగెడులాభనష్టములు, విత్తనములునాటుటకుఁ దగినకాలము మున్నగునంశములు తెలియును. ఈ సంగతులు సాధారణముగాఁ దెలిసియుండుటచే వానిగురించి యిచ్చట విస్తరింప నవసరములేదు.

2. వాయుమండలశాస్త్రము—ఇది వాతావరణస్థితిని దెల్పును. వాయుభారము హెచ్చుచున్నదా తగ్గుచున్నదా యనుసంగతిని

దెల్పుచు వర్షించునా లేక చక్కనిసూర్యరశ్మిగలిగియుండునా యను విషయముల నెఱిఁగించును. దీనిమార్పులఁ జక్కఁగాఁ బరిశీలించుటవలన సస్యవిజృంభణమునకుఁగాని సస్యక్షీణతకుఁగాని కారణముల నరయవచ్చును. ఈపరిజ్ఞానమువలన రయితు దనపనులలో నేవిముందు నేవివెనుకఁ జేయవలయునో తెలిసికొని నష్టములపాలుగాకయుండును.

3. ప్రకృతిశాస్త్రము—ఈశాస్త్రమువలన సస్యమునకును భూమికిని గలసంబంధముల నరయవచ్చును. భూమిలోనికి నీరెట్లుచొచ్చునదియు నచ్చటినుండి సస్యమున కానీ రెట్లుపయోగపడుచున్నదియు భూమిలోనితేమ నలుప్రక్కల వ్యాపించునదియు దెలియును. ఇదిగాక వాయువునకును భూమికిని గలసంబంధము, పొలములయందలి మంటి రేణువులనిర్మాణము మొదలైనవి తెలియనగును.

శిల్పశాస్త్రముయొక్క యవసర మందఱకుఁ దెలియునుగాన నిచ్చట వివరింప నగత్యము లేదు.

ఖనిజశాస్త్రము—ఇది రయితుసాగుచేయుభూమియొక్క జన్మవృత్తాంతముఁ దెలుపును. ఈశాస్త్రజ్ఞానమువలన భూతత్త్వమెఱిఁగి తగురీతిని వ్యవసాయపద్ధతుల మార్పులుజేయవచ్చును.

రసాయనశాస్త్రము—దీనిసాహాయ్యముచేత భూమియందు సస్యముల కాహారపదార్థము లేవేవిగలవో తెలిసికొని లోటుపాటుల నుచితరీతిని భర్తీచేయవచ్చును. ఇదికాక రయితు పొలములకుకట్టవలసిన యెరువులయొక్క సత్త్వమును దెలిసికొని తనకెంతమాత్రమును నష్టముకలుగకుండ వీలైనంతవఱకు లాభముల నొందగలడు. ఏయే పదార్థములు తనపశువులకాహారముగ నుపయోగించునో యెంతయాహారము కావలయునో పనిజేయుపశువుల యాహార మెట్లుండవలయునో పాలనిచ్చుపశువుల యాహార మెట్లుండవలయునో నిర్ధారణ చేసి

కొనగలదు. ఈశాస్త్రమందు మంచిపాండిత్యముగలిగియుండుటచే నమెరికా, ఐరోపా దేశములయందలి రయితులు మనరయితులకంటె నెకరమునకు నాలుగైదురెట్లెక్కువగా పంటలను పండించుచున్నారు.

ఓషధిశాస్త్రము—ఈశాస్త్రజ్ఞానమువలన సస్యములయొక్కయు వృక్షములయొక్కయు జననముమొదలు మరణపర్యంతముండు వృత్తాంతము తెలియును. ఈశాస్త్రజ్ఞానముయొక్క ప్రాముఖ్యము నొకచిన్నియుదాహరణముచే నిరూపింపవచ్చును. ఏబదిసంవత్సరములకిందట బీటుదుంప నూటికి సుమారైదువంతులుమాత్రమే శర్కరకలిగియుండెడిది. శాస్త్రజ్ఞులు ఓషధిశాస్త్రమునందలి కొన్నిపద్ధతుల నవలంబించి యేటేట పైరుచేయుటచే నిప్పుడు నూటికి 20-23 పాళ్లు శర్కరగలదుంపలు పుట్టుచున్నవి. ఇంకనెన్నియో యిట్టియుదాహరణములు వేనవేలుకలవు. సస్యములుగాని వృక్షములుగాని మనుష్యునకిష్టమగునట్లు పెరిగి పూచి కాచునట్లు చేయవచ్చును.

క్రిమిశాస్త్రము—దీనివలన సస్యమునకులాభకారులగుపురుగులేవో నష్టమునుగలుగఁజేయుపురుగులేవో తెలియును. నష్టమునుగలుగఁజేయుపురుగుల నివారించుటకుఁ దగిన పద్ధతులుగూడ తెలియును.

ఓషధివైద్యశాస్త్రము—మనుజులకు జంతువులకు వలెనే యుద్భిజ్జజాతులకుగూడ దెగుళ్లు గలుగుచుండును. అట్టిరోగలక్షణములు వానినివారించుసాధనములు నోషధివైద్యశాస్త్రమువలనఁ దెలియనగును.

పశుచికిత్సాశాస్త్రముయొక్క ప్రాముఖ్య మెల్లరకుఁ దెలిసిన యంశమే కావున నిచట బొందుపరుప నవసరములేదు.

దీనినిబట్టిచూడఁగా వ్యవసాయశాస్త్రము వివిధశాస్త్రమిళితమై మిక్కిలిబాహుళ్యముగలదని స్పష్టమగుచున్నది.

# మానవధర్మములు.

## తృతీయప్రకరణము.

పానీయములలో నీటి నేవిధముగ శుభ్రము చేయవలయునో యి
దివఱకుఁ దెలుపఁబడెను. మంచినీటికి మూడులక్షణములు గలవు.
రుచి, రంగు, వాసన లేకపోవుటయే. మనశరీరమునకు నీ రేవిధముగ
నుపయోగపడుచున్నదో తెలిసికొందము. సాధారణముగ మనము
భుజించునాహారము ఘనపదార్థమై యుండును. దాని నారూపముతో
నే పుచ్చుకొనుటయు జీర్ణింపఁజేసికొనుటయుఁ గష్టము కావున నేపదార్థ
మునైన భుజించునపు డుపయోగకరముగ భగవంతుఁడు మనకు నో
టియందు నీరూరునటుల శరీరనిర్మాణమునం దేర్పాటుచేసియున్నా
డు. మనము తీసికొనెడిపదార్థమునకు నోటిలోనియూటనీరు చాలక
పోయినయెడల నేదియో యొకద్రవమును గలిపి మనము తీసికొనుచు
న్నాము. ఆద్రవము శరీరములోనికి వెడలి యుదరములోనిఘనపదా
ర్థములనన్నిఁటిని పాలవలె ద్రవముగాఁ జేయును. ఆపదార్థము లట్ల
గుటకుఁ దీసికొనినద్రవము చాలకపోయినయెడల మనము నీటినిద్రా
గుచున్నాము. మనము తీసికొనినయీనీటివలనఁ బదార్థములన్నియు
మిక్కిలి పలచగనుండుద్రవముగా మారి జీర్ణకోశముల వెంబడిని బోవు
నపుడు శరీరములోనివివిధభాగములును దమ కుపయోగపడుపదార్థము
లను దీసికొనును. ఆపదార్థములన్నియు రక్తరూపమున శరీరమంతయు
బ్రవహించి యేభాగమునకుఁ గావలసినయాపదార్థము నిచ్చుటయే
కాక యాభాగమునం దుపయోగపడి యశుభ్రముగ నిలిచియున్న
నిరుపయోగమై యనర్థదాయకము లగుపదార్థములను శ్వాసరూపక
ముగాఁ బైకిఁ బోవునటులఁ జేయుటకు నూపిరితిత్తులలోనికి వానిని

గొంపోవుచున్నవి. రక్త మీవిధముగ శరీరమంతటను బాగుగఁ బ్రవహించి దానినంతను శుభ్రపఱచుటకుఁ దగినద్రవమును దీసికొనినతరువాత మిగ్గిలినద్రవము జీర్ణకోశములలో నిలిచియున్న నిరుపయోగమైనపదార్థముల మూత్రపురీషములరూపముగఁ గొంపోవుటకు వీలుగ నుండును. కావున మనము శరీరమునకుఁ గావలసినంత మంచినీటిని ద్రాగవలసియున్నది. నీ రెక్కువ త్రాగినను శరీర మారోగ్యస్థితియందుండినయెడల నేవిధమైన నష్టమును లేదు. ఎక్కువత్రాగి నీరు మూత్రరూపముగానో చమటరూపముగానో పైకిఁ బోవును. అందువలన శరీరములోనిభాగము లన్నియు బాగుగ శుభ్రపడును.

పూర్వకాలములలో మనదేశమునందు మంచినీటినిమాత్రమే త్రాగుచుండెడియాచార మున్నను విదేశీయులు మనదేశమును జయించినతరువాత సారాయము మున్నగుమత్తును గలుగఁజేయుద్రవములును, కాఫీ, టీ మొదలగు నుద్రేకములు గలిగించుద్రవములును మనదేశీయులచే నుపయోగింపఁబడుచున్నవి. వీనినిగుఱించి యించుక విచారింపవలసియున్నది.

సారాయము శరీరమున కేవిధముగ నుపయోగించునో నీటివలె శరీరభాగముల నన్నిఁటిని శుభ్రము చేయుట యొక్కటియేనా? కాదు. శరీరములోఁ బ్రాణము నిలువఁబెట్టుచు స్థూలశరీరమున కంతకు నాధారభూతమగుహృదయము (Heart)ను మిక్కిలి త్వరితముగఁ బని చేయునటుల నది చేయును. అందువలన శరీరమున కదివఱకున్న మాంద్యము వదలి చురుకుదనము వచ్చును ఈచురుకుదనము వచ్చుట మానవునకు లాభదాయకమని భ్రమపడవలదు. ఏలయనఁ జూడుము. ఒకచోట నిండ్లుకాలుచున్న వనుకొనుఁడు. ఆయగ్ని ప్రమాద మితరులయిండ్లకుఁ దగులకుండుటకును, గాలుచున్నయిఁటిలోనైన సా

ధ్యమైనన్నివస్తువుల నీవలకుఁ దీయుటకును జనించునుత్సాహాలాలస మానసులమై యదివఱ కెన్నఁడు నెఱుఁగనిబలమును బ్రదర్శింతుము. కాని యాపరిమాణము దాఁటిపోయినవెంటనే యంతకుఁ బూర్వము న్నసామాన్యబలమైనను లేక శ్రమపడినది యరగంటయైనయెడల నథమము రెండుగంటలకైనను మనము సహజమైనస్థితిలోనికి రాఁ జాలము. దీనివలన మనము నేర్చుకొనునీతి యేమి? అసాధారణమైన కార్యోత్సాహము మున్నగుబహిఃకారణములవలన సహజశక్తిని మించినపనిఁ గావించినయెడల నంత కనేకమడుఁగు లెక్కువకాలము తక్కువబలముతో మన ముండవలసివచ్చును. ఈవిధముగనే సారాయమువలన మనము సహజమైనచురుకుదనముకంటె నెక్కుడు గలిగియున్నను తఱువాత నంతకంటె నెక్కువకాలము సహజమైనచురుకుదనముకన్న ననేకమడుఁగులు తక్కువయైనబలమును గలిగియుండవలసివచ్చును. ఈనష్ట మొకటియే కాదు. పైనఁ జెప్పినదంతయు నొకప్పుడు విస్తారము శ్రమపడినయెడల నంతకంటె నెక్కువకాలము విశ్రాంతిఁ దీసికొనవలెననువిషయమును బోధచేయును. దానివలనఁ బ్రబలమైననష్ట మెక్కుడు లేదు. కాని యీసారాయము త్రాగుటవలన శరీరమున కాధారమని పైనఁజెప్పఁబడినహృదయము (Heart) జబ్బుపడి యొక్కొకప్పు డాకస్మికముగా నాఁగిపోవుటకూడ కలదు. అది యాఁగిపోవుటయే శరీరములోఁ బ్రాణము లేకపోవుట. కావున సారాయమువలన నిట్టియనర్థము లున్నవని యెల్లరు గ్రహించెదరుగాక.

ఇఁక టీ (tea) కాఫీ (coffee) లనుగుఱించి మనము తెలిసికొనవలసి యున్నది. ఇవిరెండును పాశ్చాత్యులు మనదేశమునకు వచ్చిన తరువాతనే వచ్చినవి. 'కాఫీ' రెండువందలసంవత్సరములకులోపుగను 'టీ' యెనుబదివత్సరములకుఁబైనను మనదేశములోఁ బ్రవేశించి

నవి. 'టీ' యనునది మన దేశములోఁ బెరుగుచున్నను దానియుపయోగమును మనవా రెఱుఁగరు. ఆయుపయోగమును మనకు బోధచేసి దానిని విరివిగాఁ బెంచునట్టుఁ జేసినవారు పాశ్చాత్యులు. ఈ రెండును సారాయమంత చెడ్డవి కాకపోయినను దానిలోని కొంత యంశము వీనియందును గలదు. కాని వీనియందు బలమునిచ్చు గుణ మున్నదని కొందఱు తలంతురు. ఆబలము పాలవలన రావచ్చును. కాని యాబలముకంటె నష్ట మెక్కువయుండును గావున నవి శరీరమున కనర్థదాయకములు.

పైఁజెప్పఁబడిన పానీయములతోఁ బాటు పానీయము కాకపోయినను జనులవలన సర్వసామాన్యముగ 'చుట్టత్రాగుడ' ని పిలువఁబడుచున్నది గనుక చుట్ట మొదలగువానిని గుఱించి చెప్పవలసియున్నది. చుట్ట కుపయోగించు పొగాకుగూడ మనకుఁ బాశ్చాత్యులవలన లభించిన ప్రసాదమే. ఇది పోర్చుగలువారిచే మనదేశమునకుఁ దేఁబడినది. దీనివలన ననేకానర్థము లున్నవని పాశ్చాత్య వైద్యులే యనేకులు తెలుపుచున్నారు ఈచుట్టపొగవలన హృదయమునందుఁ బసుపుపచ్చని మచ్చలు పడుననియు నవి యనర్థదాయకములనియు సారాయమునకున్న గుణమే సూక్ష్మముగ దీనియందును గలదనియు ననేకులు తెలుపుచున్నారు. కావున నిది యెంతమాత్రమును మానవునకుపయోగకారి కాదు. దీనికి దగ్గు మొదలైన కొన్ని రోగములను గుదుర్చు మంచిగుణము కొంత గలదట గాని యది యంతగాఁ బాటింప నవసరము లేదు సిగరెట్టు, బీడీ, గంజాయి, నల్లమందు మున్నగువాని యం దెంతమాత్రము లేశమైనను గుణములు లేవు. కావున నవి పూర్ణముగ నింద్యములు.

పానీయములను వదలి యాహారపదార్థములను గుఱించి యో

జింతము. ఆహారపదార్థములు సాత్వికములు, రాజసములు, తామసములు గని మూఁడువిధములు

పాలు, పండ్లు, పంచదార, బాదముపప్పు, గోదుమలు, బియ్యము, కాయధాన్యములు మున్నగునవన్నియు సాత్వికాహారములు. అన్నిటికంటెఁ బాలు మంచియాహారము. శరీరమునకుఁ గావలసిన పరికరము లన్నియు నిందుఁ గలవు. అంతియే కాదు మానవుఁడు తీసికొను పదార్థములన్నిటిలో నిది సులభముగ జీర్ణమగును. అందువలననే పిల్లలకు మొదటఁ బాలనిత్తురు. కాని మన దేశములో నిప్రస్తుతానుభవము వేఱుగ నున్నది. ఆంగ్లేయవైద్యశాస్త్రము నభ్యసించిన వైజ్జు ప్రతిరోగిని బాలను ద్రాఁగియుండుమని యౌషధమిచ్చును. ఆపాలు జీర్ణమగుట చాలకష్టమని మన దేశములోఁ బ్రబలమైన నమ్మకము గలదు అనుభవముగూడ నావిధముగనే యున్నట్టుల గానుపించును. దీనికి సమాధానమేమై యుండును? ఆరోగ్యవంతులగు మనుజులు పాలను ద్రావిన యెడల శరీరమునకుఁ గావలసిన పదార్థములన్నియు వలసిన పాళ్లలోఁ నందుఁ ద్రవరూపముగ నుండునుగావున జీర్ణకోశములకు విశేషశ్రమ మక్కఱలేకయే యాపాలు శరీరమున కుపయోగపడును. మానవుఁడు భుజించిన ఘనపదార్థములన్నియుఁ గూడఁ దెల్లని ద్రవరూపముగ జీర్ణకోశములో మారుచున్నవని యిదివరకుఁ దెలుపఁబడెను. అవి యట్లు లా ద్రవముగ మారుటకుఁ గల శ్రమమంతయు శరీరమున కక్కఱలేకయే పాలు జీర్ణకోశములోఁ జేరుచున్నవి. కావునఁ బాలను జీర్ణము చేసికొనుటకంటెఁ దేలికయని తేలుచున్నది. కాని లోకానుభవము మాట యేమి యందురా? సాధారణముగ లోకములోఁ బాలనుద్రావువారు రోగముతో నుండి జీర్ణకోశములు మిక్కిలి బలహీనముగా నున్నప్పుడు వైద్యునియొక్క బలవంతమువలనఁ ద్రావు

చున్నారు. ఆసమయమున బాలొక్కటియే కాదు. మఱి యేపదార్థమిచ్చిన జీర్ణము కాకపోవచ్చును. కాని లోక మొకభ్రమను జెందుచున్నది. పాలను జీర్ణముచేసికొన నేరనియీయనారోగ్యకరమైనస్థితియందును జీర్ణకోశమున కొక్కవిధమైనశక్తియే యుండునను పెద్దపొరపాటును గావించుచున్నారు. దేశీయవైద్యు లీయనారోగ్యకరమైన స్థితియం దేవిధమైనయాహారమును బెట్టక లంఘనమును గట్టెదరు. అట్లు లంఘనము గావించినను లక్ష్యములేనియవస్థయందుఁ బాల నిచ్చి యవి జీర్ణము కాలేదు గావునఁ బాలుసులభముగ జీర్ణము కావని తెలుపుట సమంజసముగ నున్నదా? ఈపాలలో గోవుపాలు మిక్కిలి శ్రేయస్కరములు. బఱ్ఱెపాలును, గొఱ్ఱెపాలు నంతశ్రేయస్కరములు గావు. అనర్థదాయకములుగూడ కావచ్చును. పాల నుపయోగించునప్పుడు మఱియొకటి జ్ఞప్తియం దుంచుకొనవలయును. వానిని బితికినవెంటనే త్రావుట మిక్కిలి యారోగ్యకరము. అవి నిలువయున్నయెడల నందు రాసాయనికమార్పులు గలిగి వానియొక్కగుణమును రుచిని చెఱచును. రుచి పుల్లగా మారును. కొన్నివిషయములలో నాపులుపు స్పష్టముగ గానిపించకపోయినను మార్పు తప్పదు గావునఁ బాలు కొలదికాలమైన నిలువయున్నయెడల నందు జనించుదోషములను బోగొట్టుటకై కాచి పుచ్చుకొనవలయును. ఇట్లు పాలను గాచునప్పు డెన్నిపాలో యంతనీటినిఁ గలిపి యానీరంతయు నావిరిరూపముగా బోవునఱకును గాచినయెడల నందలిదోషములన్నియు నశించి యవి యారోగ్యదాయకములుగ నుండును.

పండ్లుకూడఁ బాలవలెనే సులభముగ జీర్ణమగును. ఇందుండు పదార్థములన్నియుఁ బక్వమును బొందియుండును గావున మఱి యేవిధమైనశ్రమయు విస్తారమక్కరలేకయే జీర్ణమగును.

గోధుమలు, బియ్యము మొదలైనవన్నియు శరీరమునకుఁ గావలసినపుష్టి నిచ్చునాహారములు. కందులు, మినుములు, పెసలుమున్నగు పప్పుదినుసుల జీర్ణించుకొనుట పైరెండిఁటికంటె నెక్కువకష్టము. కాని పైవానికంటె నెక్కువబలము నిచ్చును. కూరలు మున్నగునవి పప్పుదినుసులకంటె సులభముగ జీర్ణమగును. వీనిని జీర్ణము చేసికొనుట పండ్లను జీర్ణముచేసికొనుటవలెనే యుండును పండ్లు స్వాభావికముగఁ బక్వమగును. పచ్చివాని నుడికించి మానవప్రయత్నముచే శరీరమున కుపయోగపడునటులఁ జేయుచున్నాము. పరిపక్వముగానిఫలములు గాని, బాగుగ నుడుకనిపదార్థములుగాని యనారోగ్యకరములు. ఏలయన వానివలన జీర్ణకోశములకు సహజమైనశ్రమకంటె నెక్కువశ్రమ కావలసివచ్చును. అట్టిశ్రమవలనినష్టము లిదివరకే తెలుపఁబడెను. ఈపైనఁజెప్పఁబడినసాత్వికాహారము యోగులకు విధింపఁబడినది.

కారము, పులుసు, కొన్నికాయగూరలు రాజసాహారములు. వీనివలన శరీరములోనికోపము మున్నగుకొన్నిదుర్గుణములకు బలము గలుగును. ప్రాపంచికవ్యాపారములలో నున్నవారి కీగుణములుకూడ నగత్యము కావున గృహస్థులలో ననేకులకు రాజసాహారముగూడ నియమింపఁబడెను. దీనిని నియమించుటకు ముఖ్యకారణము దీనివలన సాత్వికాహారముకంటె నెక్కుడుబలము కలుగుటయే.

మాంసము మద్యము మున్నగునవి తామసాహారములు. వీని వలన దుర్గుణములే శరీరమునందు ప్రాముఖ్యమును వహించియుండును దీనిరహస్యమును గ్రహించియే పాశ్చాత్యులలోఁ గొందఱును మాంసాహారము నిషేధములేనిమనహిందువులలో ననేకులును మాంసాహారవివర్జితు లగుచున్నారు. హిందూదేశములో నిట్టియభిప్రాయములు

మరల నూపుట దేశాభ్యుదయమునకు శుభసూచకము కాని ప్రాపం చక సౌఖ్యమే స్వర్గసౌఖ్యమని భావించుకలికాలమునందలి — ఈయిరు వదియవశతాబ్దమునందు — మాంసాహారమును మానినయెడల దేశ ములో ననేకుల కాహారము తక్కువగుననియు నప్పు డాహారసమస్య (Food problem) చాల చిక్కగ నుండుననియు నందుచే మాంసా హార మెక్కువగ నుపయోగించవలసినయగత్యము దేశమునకెల్లప్పు డు నుండుననియుఁ బ్రాపంచికవాదులు (Materialists) ప్రతిపాదించె దరు. కాని వేరొకమూలనుండి యొకశుభవార్త వినవచ్చుచున్నది. ఈయైరోపామహాసంగ్రామమున జర్మనీలో నాహారమునకెక్కువచి క్కులను బడుచుండుటచేఁ జెట్లలోనుండికూడ జనులకుపయోగించు నాహారపదార్థముల నమితముగఁ దీయురహస్యమును వారు కనిపెట్టిర నియు నందువలన వారి కాహారసమస్య దుర్ఘటముగ లేదనియు నచ్చ టచ్చట వినఁబడుచున్నది. అది యెంతవఱకు సత్యమో మనకుఁ దె లియదుగాని యది సత్యమేయైనయెడల నానూతనపరిశోధనవలనిలాభ మును ప్రపంచములోనిమానవలోకమంతయుఁ బొంది క్రూరమైన జంతువధను మానివేయుదురు గాత!

మన మిట్లు చెప్పుకొనుచుండినయెడల వంగదేశములోనిమన సోదరుఁడైనబోసుగారు లేచి 'యేమనుచున్నారు! చెట్లకు సుఖదుః ఖానుభవము లేదనియా యేమి వానిని బాధింపఁజూచుచున్నారు?' అని ప్రశ్నింపుచున్నారు.

ఇందులకు వినయపూర్వకముగ వారి కీదిగువసమాధానమును మనము చెప్పవచ్చును.

"అయ్యా! మీరాపెఁ గోపపడవలదు. చెట్లకుఁ బ్రాణము లేదని యు, వానికి సుఖదుఃఖానుభవజ్ఞానము లేదనియు మాయుద్దేశముగాదు.

# అమలవర్త.

## ప్రథమాంకము.

ప్రథమరంగము—ధర్మార్కపురము.

ప్రదేశము—కోటయెదుటి కావలిసావడి.

ప్రవేశము—ప్రాంశుకుఁడు, కావలిమీఁద నుండఁ బర్ణాదుఁడు ప్రవేశించును.

పర్ణా—ఎవ రక్కడ ?

ప్రాంశు—ఏమి ! నీ వెవ్వఁడవు ? అక్కడ నిలిచి సమాధానము చెప్పుము.

పర్ణా—నేనోయి !

ప్రాంశు—పర్ణాదా !

పర్ణా—ఆఁ ! నేనే !

ప్రాంశు—సరిగా నీవేళకు నీవు వచ్చితివి !

పర్ణా—ఇప్పుడే పండ్రెండు గొట్టినది. మిత్రమా ! నీవుపోయి పండుకొనుము.

ప్రాంశు—నీకుఁ బదివేలనమస్కారములు. చలి మిక్కిలియెక్కువగా నున్నది. ఏమోగాని నామన సేలాగుననో యున్నదోయి !

పర్ణా—నీకావలిసమయమున వింత లేమియూ లేవుగద !

ప్రాంశు—ఎలుకయలుకుఁ డైన లేదు !

పర్ణా—సరే ! నీవు పద. హరేశమారశీలురు నీకుఁ గాన్పించినఁ ద్వరగఁ బంపుము.

ప్రాంశు—అదె వచ్చుచున్నట్లున్నారు. ఆఁ! ఆఁగు. ఎవరువారు ?

(హరేశమారశీలురు ప్రవేశింతురు.)

హరే—మ ఱెవ్వరును లేరు. మేము.

మార—ప్రభుసేవకుల మే.

ప్రాంశు—అనుకొనుచుండఁగనే వచ్చినారు. మీకు నూఱేం డ్లాయువు

మార—ప్రాంశుకుఁడా! నీపనిలోని కెవరువచ్చి ని న్నంపినారు!

ప్రాంశు—పర్ణాదుఁడు. నేను పోవుదునా?

మార—సరే! మంచిది! వెళ్లుము.

(ప్రాంశుకుఁడు నిష్క్రమించును.)

హరే—ఓహో! పర్ణాదుఁడా!

పర్ణా—ఏమి? వా రెవరు? హరేశుఁడా యాతఁడు?

హరే—ఔను. అటువంటివాఁడే!

పర్ణా—హరేశా! దయచేయుము. మారశీలా! రమ్ము.

మార—అది యీరేయి మరల నగపడెనా?

పర్ణా—నా కేమియుఁ గనఁబడలేదు.

మార—హరేశుఁ డిదియంతయు వట్టిభ్రమగాని మ ఱేమియుఁ గా దనుచున్నాడు. మనము దానిని రెండుమాఱులు కన్నులారఁ జూచినార మని యెంత చెప్పిన నా మాట లీతనితల కెక్కలేదు. అందుచేత నీవే స్వయముగాఁ జూచెదవు ర మ్మని తీసికొని వచ్చితిని. ఇప్పు డది కనఁబడెనా యీతఁడు దానితో మాటలాడి మనకుఁగూడఁ గన్నులున్న వని నమ్మఁగాక.

హరే—చాలింపుఁ డీమాట లింక. బయలుదేఱినారు బంట్లు మీరు! అది వచ్చె నెక్కడ?

పర్ణా—కొంచెముసేపు తాళుము. తరువాత మేము రెండునాళ్లనుండి వరుసగాఁ జూచుచున్నగ్రహముసంగతి నీచేతనే నిజ మని చెప్పించెదము. నీ వెంత బింకములు జేసినను సరే!

హరే—సరే! చూతము గాక. ముం దిప్పుడు కూరుచుండి పర్ణాదుఁడు చెప్పున దేమో విందము.

పర్ణా—గడచినరాత్రి యదిగో, ధ్రువనక్షత్రమునకుఁ బడమటనున్నయాచుక్క సరిగా నిప్పుడున్నచోటికే వచ్చి ప్రకాశించుచుండఁగా నేనును మారశీలుఁడును గంటలను, ఒకటి

మార—ఉండుండు! మాటలాడకు! చూడు! అది వచ్చుచున్న ట్లున్నదోయి!

(గ్రహము వచ్చును.)

పర్ణా—(చూచి) సరిగా మృతినొందినరాజాకారమే!

మార—హారేశా! నీవు తెలిసినవాఁడవు. దానితో మాటలాడుము.

పర్ణా—అది రాజువలె లేదా? చూడు. హారేశా!

హారే—అదియేపోలిక! నాకు భయము నాశ్చర్యముఁ గూడఁ గలుగుచున్న వోయి!

పర్ణా—అది మనము పలుకరించినఁ బలుకవలె నని చూచుచున్నది.

మార—హారేశా! పల్కరింపుము.

హారే—గీ. ఎవఁడ వీరీతిఁ జూపట్టె ♦ దిట్టిరాత్రి
మఱియుఁ దాల్చెదు మృతిఁగన్న ♦ మావిభుండు
కొన్ని వేళలధరియించు ♦ కొనెడిరూపు
దైవమే యాన చెప్పుము ♦ తప్ప దిఁకను.

మార—దానికిఁ గోపము వచ్చినది.

పర్ణా—అదిగో! పోవుచున్నది.

హారే—ఆఁగు! పల్కవేమి? నే నడిగినదానికి సమాధానము చెప్పు.

(గ్రహము నిష్క్రమించును.)

మార—పోయినది. మాటలాడినది కాదు.

పర్ణా—ఏమోయి! హారేశా తెల్లఁబోయి గజగజవణఁకుచున్నా వేమి? ఇది పట్టి భ్రమయేనా? ఏ మనియెదవు?

హారే—దైవసాక్షి! నాకన్నులతో నేను జూచుపఱకు దీనిని నమ్మలేకపోయి నాఁడను.

మార—అది రాజువలె లేదా?

హారే—ముమ్మాటికి నట్లే యున్నది. అతఁడు నర్మపురికి దండెత్తిపోయినప్పు డీకవచమునే తొడిగినాఁడు. శత్రురాజులతో సంధిమాటల నొల్లక వారిమర్మములు గాఁడ నేసినపు డొకమా ఱిట్లే మొగమును జిట్లించినాఁడు. ఇది యద్భుతముగా నున్నది.

మార—ఇట్లే యిదివఱకు రెండుతడవలు సరిగ నిట్టినిశీథసమయమున యోధగమనముతో మాప్రక్కనుండి నడచిపోయినది.

హరే—ఏవిధముగ నాలోచింతమన్నను దోఁచుట లేదు. కాని మొత్తము మీఁద మనరాజ్యమున కేదో కీడు మూఁడ నున్న దని నాయభిప్రాయము.

మార—సరే కాని తెలిసినవాఁడవు నాకుఁ జెప్పు.

సీ. ఏ రేయి విడువక ♦ యీరీతిఁ గావలిఁ, బ్రజనలయించు టే ♦ పని దలఁచిరొ
యనుదినంబును గ్రొత్త ♦ యాయుధంబులఁ, గొంట, కంచుఫిరంగుల ♦ గడనసేత
విశ్రాంతి యెట్టిదో ♦ వినమైనవిననీక, యుద్ధనావికుల స ♦ న్నద్ధ మేల?
పగలు రేయియనఁగ ♦ బరఁగు భేదము లేక, యిట్టిహోళాహళి ♦ కేమి కతము?

గీ. దీని కంతకు మూలంబు ♦ దెలియరాదు
కారణము జెప్పువారలుఁ ♦ గానరారు
విస్మయం బయ్యె నామది ♦ వెఱపు దోఁచె
నీకు నేమైనఁ దెలిసిన ♦ నెఱుఁగఁ జెప్పుమ.

హరే—కొంతవఱకు నే నెఱుఁగుదును. అది యెంతవట్టు నిజమైనను నట్టివదంతి మాత్ర మొకటి కలదు. అది యేమంటి వేని వినుము.

చ. ఎఱుఁగుదు కాదె నర్మవిష ♦ యేశుఁడు లుబ్ధుఁడు గర్వ మూని యీ
నరవరు వాజికిం బిలువ ♦ నాతనిపైఁ జని శౌర్యశాలియై
యరికరిసింహమన్ బిరుద ♦ మంచితమై తగ వానిఁ గెల్చి యీ
ధరణిపురాజ్య మెల్లఁ దన ♦ దానిగఁ జేకొనె ధర్మపద్ధతిన్.

మార—ఔను! అది యెఱుఁగుదును.

హరే–ఉ. ఆతనిసూనుఁ డిప్డు తన ♦ యయ్యగుణించిన రాజ్యమంతయున్
జేత గణింతు నే ననుచుఁ ♦ జేర్చెను గొందఱ మొండిబండలన్
బోతరులైనవారిపయిఁ ♦ బోవుట కంచుఁ దలంతు నాయుధ
వ్రాతము సేకరించుటయుఁ ♦ బట్టణరక్షణ మాదికార్యముల్.

ప్రాంశు—ఇదియే కార్యము గాని మఱియొకటి కా దనుకొనియెద. మనము కావలి యున్నప్పుడు రాజాదయ్యా మాయుధముల ధరించివచ్చుటకూడ దీని కనుగుణము గానే యున్నది. అది నిస్సందేహముగ రాజును బోలి యుండుటయు నిజమే. ఈ యుద్ధముసంగతియు నిశ్చయమే.

హరే–ఉ. ఔ నిది కంటిలోన నలు ♦ సట్లు మనంబుఁ దలంపసాగెడున్
గానగవచ్చె నుల్కతతి ♦ గాడ్పులు వీచు విరుద్ధరీతులన్

భానుఁడు జంద్రుఁడున్ మలిన ♦ భావము నొందిరి కాంతిహీనులై
దీనినిఁ జూడ నామదికి ♦ దేశవినాశము దోఁచెడున్ సఖా!

దుశ్శకునములు మెండయినవి. ఇట్టియుత్పాతములు పూర్వము రాజ్యవిపర్యయ కాలమున సంప్రాప్తమైనట్లు పురాణముల విందుము. వెనుక రోమకరాజ్యచక్రవర్తి మరణమునొందుతఱి నిట్టే పొడసూపినదఁట. ఆఁ ఉండుము. అది మరల వచ్చుచున్నది.

(గ్రహము పునఃప్రవేశము)

ఏమయినను సరే దాని నడ్డగించెదను—భూతమా! ఆఁగుము.

ఉ. మాటలు నేర్చితేని యను ♦ మానము మానుము మాటలాడు మీ
వేటికి నీగతిన్ దిరుగు ♦ దెద్దిప్రియంబు సుఖంబు నీ కిడున్
వీటికి మూడుకీడు నుడి ♦ పింప నుపాయ మెఱుంగుదేమొ; యె
చ్చోటనునైన నర్థమును జొప్పడ ♦ బూడ్చితివేమొ చెప్పుమీ.

ఇట్టిగాటంపుకోర్కె లున్నగ్రహములిట్లు తిరుగు నందురు. చెప్పుము.

(కోడి కూయును)

ఆఁగి సమాధానము చెప్పుము. మారశీలా! దాని నాపుము! పోనీయకుము.

మార—నాకత్తితో దానిఁ గొట్టుదునా?

హారే—ఆఁగకున్నఁ గొట్టుము.

ప్రాంశు—ఇదిగో! ఇక్కడకు వచ్చినది.

హారే—ఇదిగో! ఇదిగో!

మార—పోయినది! గ్రహము పోయినది.

ఆ. వె. దానిగొప్పతనముఁ ♦ దలఁపక వెఱపింపఁ
దప్పు మనది దానిఁ ♦ దాఁకునె మన
కత్తి; గాలిఁజీల్చు ♦ కరణి నశక్తియు
దుర్జనత్వము లవి ♦ తోఁచుఁగాని.

ప్రాంశు—కోడికూసినప్పు డది మాటలాడుటకు సిద్ధముగానున్నదిసుమా!

హారే—తరువాత నదరిపడి దండవిధాయింగాంచిన నేరస్థునివలెఁ బాఱిపోయినది. వేకువబాకాయగుకుక్కుటము తన పెద్దకీచుటెలుంగు చెలంగ వేవెలుంగును మేలుకొల్పు ననియు నట్లగుటచే దాని వినినతోడనే పృథివ్యాపస్తేజోవాయుమండలంబులం దెందు

సంచరించునవియైనను భూతము లన్నియు వేవేగఁ దమనిలయంబులకుఁ జేరుకొను ననియు వినియున్నాఁడను. దానినిజము నిప్పుడిది ఋజువు చేసినది.

మార — కోడికూసినతోడనే యదృశ్యమైనవి. ఏసుక్రీస్తుజన్మదినోత్సవము జరుగునప్పుడు మేలుకొలుపులుగు రేయి యంతయు విరామములేక కూయుచుండు నఁట. అందుచే భూతంబు లెవ్వియు నాసమయమున బయల నడుగుపెట్ట నోడి యుండు నఁట. దాన నారాత్రి యన్నియు దుర్గ్రహసంచారము, కామినీవిహారము, పిశాచ పరిచారము మున్నగునవన్నియుఁ గట్టువడి నిర్మలముగా నుండునఁట. ఆకాల మంతపరమ పవిత్రముగాను సుఖప్రదముగాను నుండునఁట.

హారే — నేను నట్లే వినియున్నవాఁడను. అది కొంతవఱకు నిజమైనను గా వచ్చును కాని యటుచూడుము. భానునిధూసరమరీచులు పూర్వాద్రిపరిసరప్రాలేయంబుపైఁ బ్రసరించుచున్నవి. మనకావలి చాలింపవచ్చును. మన మీరాత్రిఁగనినవిశేషములను కుమారామలవర్మకు నివేదింపవలెను. ఏ మనిన నీభూతము మనతోఁ బలుక కున్నను వానితోఁ దప్పక మాటలాడును. మన కాతనియం దున్నయనురాగమును బట్టి దీని నాతని కెఱిఁగించుట మనకు విధాయకమైనధర్మ మని నీ వంగీకరించెదవా?

మార — సందేహ మేమి? ఈయుదయమున మనమాతనిఁ గలిసికొనుట కెక్కడ ననువుగానుండునో తెలిసికొందును.

(అందఱు నిష్క్రమింతురు.)

## అమలవర్మ — ప్రథమాంకము.

### ద్వితీయరంగము.

ప్రవేశము: — రాజు, రాణి, కుమారామలవర్మ, బాణుఁడు, లాఘవుఁడు, వృత్తిమండలుండు, దీర్ఘకర్ణుఁడు, సామంతులు, సేవకులు.

రాజు — సభ్యవరులారా!

సీ. మాయన్న యమలుని ♦ మరణసంస్మృతి యింక, మదిఁ గడునుడుకున ♦ మందు నున్న
మనమందఱము దుఃఖ ♦ మానసంబుల నున్న, ధాత్రి కన్నీళ్ళచేఁ ♦ దడిసి యున్న

ధైర్యవివేకముల్ ♦ తగ నూతగాఁ గొని, హృదయంబు లెల్లెట్లో ♦ పదిలపఱచి
చనినధాత్రీశుపై ♦ జ్ఞానోచితార్తిని, గల్గి మనస్థితి ♦ గతులఁ దలఁచి
ఆ. వె. తొల్లి పదిసె యిప్పు ♦ డిల్లాలు నా కయ్యె
నొక్కకంట నీర ♦ మోడుచుండఁ
బేతకర్మముదము ♦ పెండ్లిలో శోకము
నిట్లు వ్యత్యయగతి ♦ నెనయవలసె.

ఈవిషయమున మీయందఱియనుమతిని బొంది మీయాలోచనమునుబట్టియే నడచుకొన్నారము గదా? మీప్రతిభావిశేషములను బాగుగా వినియోగపఱచి తగినట్లు కార్యమును నెఱవేర్చినందులకు మీకందఱకుఁ గృతజ్ఞులమై యుంటిమి. ఇఁక నిప్పుడు విచారణీయాంశ మే మనిన—

చ. మనబలశౌర్యధైర్యముల ♦ మానము లాఘన మంచు నెంచియో
ఘనుఁడు మదగ్రజుండు చన ♦ గానె ప్రభుత్వము భిన్న మయ్యెనం
చనుకొనియో స్వకీయులవ ♦ శౌర్యబలంబుల గొప్పగాఁ గలన్
గనియొకొ యుగ్రుఁ డిట్లు మన ♦ కంపెను దూతను సాహసంబునన్

క. తనతండ్రి సమరరంగము
నను నోడినభూము లెల్ల ♦ నయముగ దన కి
మ్మనియును లేదా పోరికిఁ
బనివడి రం డనను వీని ♦ పల్కులు వినిరే.

వాని వృత్తాంత మి ట్లున్నది. ఈమనసమావేశమునకుఁగల కారణ మిదియే. పసివాఁడగు నీయుగ్రునిపినతండ్రి వయోవృద్ధుడు రోగపీడితుఁడు నైయుండుటఁ దన యన్నకుమారునియుద్యమము నెఱిఁగి యుండఁడు. అందుచేత నాతనిరాక మాన్పించునది యని పెద్దయగు వానికి వ్రాసి యంపుచున్నారము. అందు మనబలంబులలావును జేవయుఁ జక్కగ వివరింపఁబడియే యున్నవి. దీనిం దీసికొని యోకర్ణా! నీవును వృత్తిమండనా! నీవును వర్మదేశమున కీసందేశముఁ గొంపోవలయును. ఈమాసందేశమునఁ దెలుపఁబడినవిషయములకంటె నొండుపద్ధతులను వారితో నంగీకరింప మీరుస్వాతంత్ర్యమును బూనరాదు. పోయిరండు. శీఘ్రముగ వచ్చి మెప్పువడయుదురు గాక!

కర్ణ, వృత్తి—అందును మఱియొందును గూడ స్వధర్మపరాయణులమై యుందుము దేవా!

రాజు—అది మే మెఱిఁగినవారమే, సందేహము లేదు. పోయిరండు. మీకు భద్ర మగుఁగాక!

(కర్ణ, వృత్తిమండనులు నిష్క్రమింతురు)

లాఘవా! విశేషము లేమి? నీ కేదో కోరిక గల దని చెప్పియుంటివి! అది యేమి?

ఆ. వె. నీదుతండ్రికి నాకును ♦ లేదు భేద
మతనిమనసె నాదుమనను ♦ నతనివాక్కె
నాదువాక్కు నాటను నీవు ♦ న్యాయసరణి
వాంఛసేసిన నేదియు ♦ వ్యర్థపడదు.

లాఘ—మహాప్రభూ! ప్రాంశుదేశమునకుఁ బోవ మీ సెలవును ననుగ్రహమును గోరుచున్నాఁడను. అక్కడనుండి ధర్మబద్ధుఁడనై యేలికపట్టాభిషేకోత్సవమునకు వచ్చియున్నాఁడను. ఆపని తీరినది. మరల నేగవలయు నని నాహృదయ మభిలషించుచున్నది. గాన దీని మీకు నివేదించినాఁడ. క్షమింపఁ బ్రార్థించుచున్నాఁడ.

రాజు—నీతండ్రితోఁ జెప్పితివా? బాణుఁ డేమనుచున్నాఁడు.

బాణు—దేవా! అదేపనిగా నన్నడిగి యెట్టకేలకు నన్నొప్పించినాఁడు. వాని యభిప్రాయప్రకారము చిట్టచివఱకు వానిపోక కిష్టములేనివాఁడ నయ్యు నంగీకరించినాఁడను. దయచేసి మీరు సెలవిచ్చెద రని ప్రార్థించుచున్నాఁడను.

రాజు—లాఘవా! శుభముహూర్తమునం గదలి పొమ్ము. నీ స్వేచ్ఛావిహారములం గాలము పుచ్చెదవు గాక. అనుంగా! అమలవర్మా! నా ప్రియపుత్రకా!

కుమా—(జనాంతికము) నీకు నేను సరిగా నెద్దియును గాను. నీకు నేను గొడుకునా?

రాజు—ఇది యెట్లు? నీముఖచంద్రుఁ డింకను మేఘచ్ఛన్నుఁడై యున్నవాఁడు.

కుమా—లేదు రాజోత్తమా! నా కినానురక్తి మిక్కుటమైనది.

రాణి—నాయనా! అమలవర్మా!

ఆ. వె. విన్నదనము బాసి ♦ వీక్షింపు మీభువిఁ
బుత్ర! తండ్రినివలెఁ ♦ బూర్ణభక్తిఁ
గనులుకాయఁగాయఁ ♦ గలకాల మిటు చూడఁ
జూడఁ గలనె? చనిన ♦ శూరు జనకు.

మఱియు.

ఆ. వె. పుట్టువార లెల్ల ♦ గిట్టుట ధర్మంబు
నిదియు నీ వెఱుంగ ♦ వే కుమార !

అమల—ఔను. అమ్మా ! ఈధర్మ మందఱు నెఱింగినదే.

రాణి—ఎఱింగియున్నదాని ♦ కింతగా వగమున
ట్లగపడియెద వేల ♦ ననుగుపట్టి.

అమల—తల్లీ ! అట్లుకనఁబడుచున్నాఁడ నందువా ?

సీ. కన్పడుటేకాదు ♦ కన్నతల్లీ యిది నిక్కంబె పటనంబు ♦ నే నెఱుంగ
మలినవస్త్రంబులు ♦ మలినాంగకంబులు శోకచిహ్నంబులు ♦ శోషిలుటలు
కన్నీటిధారలు ♦ గడువేడియూర్పులు బుడిబుడియేడ్పులు ♦ మున్నగునవి
వెన్నియైనను గాని ♦ యేర్పరింపఁగఁజాల నమ్మ నామదినున్న ♦ యట్టివగపు
గీ. పైనఁజెప్పినవన్నియు ♦ వట్టివగలు
వాని నేరైన నటియింప ♦ వచ్చుఁగాని
నాదుమదిలోనఁగట్టిగా ♦ నాటియున్న
దలవిగానట్టిదుఃఖమో ♦ యమ్మ వినుము.

రాజా—కాలధర్మమునొందిననీతండ్రియందు నీ కిట్టివిశ్వాస ముండుట శ్లాఘాపాత్రమే గాని.

ఉ. తండ్రినిగూర్చినీ విటులఁ ♦ దద్దయు దుఃఖము నొంద నౌనె ? నీ
తండ్రికిఁ దండ్రి పోఁడె యల ♦ తండ్రియుఁ దండ్రిని గోలుపోఁడొకో
దండ్రి ! యి దొక్కనీతలనె ♦ ధారుణి గల్గెనె యెందరైరొ యీ
తండ్రులు తాతలున్ వరుస ♦ ధాతకునైన గణింప శక్యమే.

ఆ. వె. చనినవారికొఱకుఁ ♦ జనకయుండినవార
లార్తినొందు టుచిత ♦ మౌనుగాని
విధివిరామ ముడిగి ♦ విడువక కలకాల
మొక్కరీతి వగచు ♦ చుంట తగునె ?

అట్లు వగచుట మగంటిమి కాదు. పరమార్థమునకా హాని. అది సరికాదు. అట్టివాని హృదయము ధైర్యవిరహిత మనియు, మనసు క్షమాశూన్య మనియు, బుద్ధివివేకవిహీన మనియు, భగవంతుఁడు దలంచును.

ఆ. వె. సృష్టి కాదినుండి ♦ యిటుచావు పుట్టువుల్
ప్రకృతిసిద్ధము లయి ♦ పరగునపుడు
తగవె వగన సఖియఁ ♦ దప్పనట్టిమృతికి
లాభ మేమి దాన? ♦ లోభ మేల?

క. ధృతిచెడి శిశుగతి నేడ్చిన
గతియించినవానియాత్మ ♦ కలమట గలుగున్
మతిమంతు లొప్పు రీస్థితి
యతివిపరీతంబు దైన ♦ మటులనె దలఁచున్.

కనుక కుమారా! నామాట విని నిష్ప్రయోజనమైన యీదుఃఖమును మాని నేనే తండ్రి ననుకొనుము. రాజ్యమునకు నీవే ముఖ్యుఁడ వని లోక మెఱుంగుదురుగాక! నిక్క మగుపుత్రవాత్సల్యముతో నేను నిన్ను బట్టభద్రునిగాఁ జేయువాఁడ. నీవు విధానపుర పరిషదమునకుఁ బోవ నెంచుట మాకెంతయుఁ గిట్టదు. మాప్రార్థన విని యీయుద్యమమును మాని మాకన్నులు చల్లగా మాయెదుట సభ్యుఁడవై, కుమారుఁడవై, యాప్తుఁడవై మెలంగుము.

రాణి—అమలవర్మా! తల్లినైననాప్రార్థనమును వ్యర్థపరుపకుము. నిన్ను బతిమాలుకొందును విధానపురమునకుఁ బోవలదు నాయనా!

అమల—సర్వథా మీకు విధేయుఁడను.

రాజు—కుమారా! చక్కనిసమాధానమును జెప్పినాఁడవు. నామనసు చల్లఁబడినది. నాయనా! మావలెనే నీవును ధర్మార్గమున నుండుము. దేవీ! రమ్ము. శాంతమైనట్టియు, స్వచ్ఛందమైనట్టియు, నీతనిప్రత్యుత్తరము, నామనస్సున కమితానందము నొడఁగూర్చినది. నేఁడు మనకుఁ గలుగుసంతోషమును మన ఫిరంగులు నాకలోకమునకుఁ జెప్ప నచ్చట నున్నదేవదుందుభులు ప్రతినాద మీయవలెను. రమ్ము.

[అమలుఁడుగాక యందఱు నిష్క్రమింతురు.]

అమలు—వజ్రకఠినమైనయీపాడుశరీరము కఱఁగి నీరైన బాగగుంగదా! ఆత్మహత్యదోషావహం బని భగవంతుఁడు శాసించియుండకపోయినను మేలుగా నుండును. ఓభగవంతుఁడా! ఈలోకవర్తనమంతయు విపరీతముగాను నిష్ప్రయోజకముగాను మోహపరకీంతముగాను, శ్రమాపాదకముగాను దోఁచుచున్నది. ఛీ! ఛీ! ఈలోకము ఎచ్చటఁజూచినను బొమ్మజెముడువలెఁ బాపము పెరుఁగుచున్నది.

ఉ. అంతకు నింత వచ్చెఁగద ♦ యాతఁడు వోయి ద్వితీయమాసమే
నంతము నొందలే కకట ♦ యాన్నృపుఁ డామహనీయుఁ డేఁడ ? యీ
హంత నృశంసుఁ డేఁడ ? కమ ♦ లాప్తునికిన్ మఱి కాంతిపుర్వు కు
న్నంతటి యంతరంబు గల ♦ దక్కట ! దక్కితె వీని కమ్మరో !

ఆమహనీయునకు నీయం దెంత ప్రేమ ! నీపై గట్టిగా గాలియైనసోకనీయనొల్లనివాఁడు హా ! ఏమి కలియుగము. ఇట్టివైపరీత్యములు చూడ నయ్యెఁ గదా ! తినినకొలఁది నాకలి యెక్కువైనరీతిని నీవు మాతండ్రిం బట్టుకొని వ్రేలాడుచుండెడిదానవు—అట్టి దాన వొక్కనెలలో—అబ్బ !—ఆలోచించిన జపలత్వమే స్త్రీయై జన్మించినట్లు తోచు చున్నది. ఒకనెల యయ్యెనో లేదో. కన్నీరు మున్నీరుగా నేడ్చుచు—అట్టి యామె—

తే. గీ. రుద్రభూమికి శవముతో ♦ రోదనంబు
సేయు చేగినశ్రమ యైనఁ ♦ బాయకుండ
నింతి కాంతునితమ్ముని ♦ నెంతొ ప్రేమఁ
బెండ్లియాడెను నింతకున్ ♦ బెద్దకాల
మడవిజంతువు లైనను ♦ నార్తినొందు.

ఆపుణ్యునికి వీనికి నెంత యంతర మున్నది. హస్తిమశకాంతరముగదా ! ఒక్కనెల లోపున ఆపాపిష్ఠికన్నులనుండి కాఱెడు కలుషబాష్పముల తడియారకమునుపే వివాహ మపేక్షించినది. ఓహో ! ఎంతపాపపుఁజేఁత. ఇది ముప్పునకే వచ్చినది హృదయమా ! ఆఁగుము. నేను మాటలాడరాదు.

(ప్రవేశము. హరేశుఁడు, మారశీలుఁడు, వర్ణాదుఁడు.)

హరేశ—దేవరకు జయ మగుఁగాక.

అమల—నిన్నుఁజూడఁ జాలసంతోష మయినది హరేశా ! హరేశుఁడవేనా లేక నేను మఱచిపోయియుందునా?

హరేశ—దేవా ! మీ సేవకుఁడనగుహరేశుఁడనే.

అమల—అయ్యా మిత్రమా ! నన్ను నీవు నట్లే పిలువవలయు నని నాకోరిక. విధానపురమునుండి యిం దేల వచ్చితివి. హరేశా ! మారశీలుఁడా ?

మార—చిత్తము ప్రభూత్తమా.

అమల—(హరేశునితో) నిన్నుఁ జూచుటకుఁ జాల సంతోషముగా నున్నది

నీకు మేలు కలుగుఁగాక! కాని విధానపురమునుండివచ్చి యిచ్చట నేమి చేయుచు న్నావు.

హారీశ—పని యేమున్నది? సోమరినై తిరుగుటయే.

అమల—నీశత్రువయిన నట్లు వచింపలేఁడు. నీవు వ్యతిరేకముగఁ జెప్పి నన్ను నమ్మించునంతటిపాపమునకు నీ వొడిగట్టను గాదు. నీవు సోమరివిగా వని నే నెఱుంగుదును. కాని నీ కిక్కడ పని యేమి? నీవు తిరిగి పోవులోపల నీకుఁ గావలసినన్ని విశేషములు తెలియునులే.

హారీశ—దేవా! మీతండ్రిగారియుపరకర్మఁ జూడ వచ్చినాఁడను.

అమల—సమాపాఠకా! నన్ను వెక్కిరింపకుము. మాయమ్మగారివివాహమును జూడ వచ్చితివి కాఁబోలును.

హారీశ—అదియు నప్పుడే తటస్థపడినది దేవా!

అమల—హారీశా! నీది ధనాశ! లోభమువలన నట్లు జరిగినది. శ్రాద్ధపుగారెలే స్థాలీపాకమునకుగూడఁ బనికివచ్చును గదా యిట్లు చేసినయెడల హారీశా—ఇట్టిఘోరకృత్యమును గన్నులారఁ జూచుటకంటె మరణించియును శత్రుబారిఁబడుట మేలుగదా! హాతండ్రీ! అయ్యో నాతండ్రివలె గనఁబడుచున్నాఁడు.

హారీశ—రాజా! ఎక్కడ?

హార—నేను నొకమాఱు చూచినాఁడను. అతఁడు చక్కనిరాజు.

అమల—వీరపురుషుఁ డన నతఁడే. అతనికరి మఱియెవ్వరును గానరారు.

హారీశ—రాజా! నే నాతనిఁ గడచినరాత్రిఁ జూచితి ననుకొంటెని.

అమల—ఎవరిని జూచితివి?

హారీశ—మీతండ్రియగుమహారాజును.

అమల—నాతండ్రియగురాజునా?

హారీశ—మీయద్భుతాశ్చర్యంబుల నించుక శమింపఁజేసి వీ రిరువురును సాక్షులుగా నేను చెప్పునది సాకల్యముగఁ జిత్తగింపుఁడు.

అమల—దేవుఁడు నీకు మేలుసేయుఁగాక అని యేమో చెప్పుము.

హారీశ—ఈమారశీలపాలింశుకు లిరువురు నర్ధరాత్రమునఁ గావలియుండఁగా రెండుమాఱులు వీరికిఁ గన్పించినది మీతండ్రిఁబోలినవిగ్రహము నఖశిఖపర్యంత మాయుధధారియై వారి కగపడి గంభీరగమనముతో నెమ్మదిగా వీరిపక్కనుండి నడచి

పోయెను. భయముచే వీరు బెదరిబెదరి చూచుచుండ ముమ్మారు నట్లు దీర్ఘాకారముతో నడచిపోయినది. వీరు నెఱపుచేనిలువున నీరై నోటమాట రాక దానితోఁ బలుక నోడి దీనిని రహస్యముగ నాతోఁ దెలిపిరి. మూఁడవనాటిరాత్రి నేను కూడ వారితోఁ గావలి యుండ సరిగ వారు చెప్పినవేళకు అదే యాకారముతో వారు చెప్పిన దంతయు వాస్తవ మగునట్లు ఆయాకారము గోచర మయ్యెను. నేను మీతండ్రిగారిని బాగుగ నెఱుఁగుదును. ఆగ్రహ మచ్చముగ నాయనవలెనే యున్నది.

అమల—ఎక్కడ యిది?

మార—మేము కావలి గాచుసావడిమీఁద.

అమల—మీరు దానితో మాటలాడలేదా?

హరేశ—రాజా నేను బలుకరించితిని గానియది మాటలాడలేదు. ఒకమాఱు మాత్రము మాటలాడ నుద్యుక్తమైనరీతిని దల యెత్తినట్లు తోఁచెను గాని యప్పుడే వేకువ కోడి కూయుటచే నాధ్వని వినినతోడనే యది మాయమై పోయినది.

అమల—ఇది చాల యద్భుతముగా నున్నదే!

హరేశ—రాజశేఖరా! నాప్రమాణముగాఁ జెప్పుచున్నాను. ఇది యంతయు నిశ్చయము. దీనిని మీకు నివేదించుట మాకు విధి యని యెంచి యిట్లు వచ్చితిమి.

అమల—ఔను నిశ్చయమే కాని నా కేమియుఁ దోఁచుట లేదు. ఈరేయి మీరు కావలియుందురా!

మార—<br>ప్రాంశు— } ఉందుము దేవా!

అమల—ఆయుధములు ధరించి వచ్చునని కాదా మీరు చెప్పితిరి.

మార—<br>ప్రాంశు— } చిత్తము దేవా!

అమల—నఖశిఖపర్యంతమునా?

మార—<br>ప్రాంశు— } ఆ! ఆపాదమస్తమును.

అమల—అట్లయిన మొగము గనఁబడలేదా?

హరేశ—నాకుఁ గనఁబడినది. కిరీటము పైకెత్తఁబడియున్నది.

అమల—ఏమి? కోపముగా నున్నట్లు గనిపించెనా?

హారేశ — ముఖము వైఖరి కోపముకంటె విషాదమును సూచించుచున్నది.

అమల — తెల్లఁబాఱియున్నదా ? ఎఱ్ఱగా నున్నదా?

హారేశ — లేదు మిగుల వెల్లనై యున్నది.

అమల — దృష్టి నీమీఁద నిల్పి చూచెనా ?

హారేశ — తిన్నఁగాఁ జూచినది.

అమల — నేను గూడ అక్కడ నున్నబాగుగా నుండునుసుమీ !

హారేశ — నీ వాశ్చర్యపడిపోదువు.

అమల — కావచ్చునుఁ నిజమే అది చాలసేపుండెనా ?

హారేశ — పదిపదిగా నూఱంకెలు లెక్కపెట్టినంతసేపున్నది.

మార — <br>ప్రాంశు — } అంతకన్న నెక్కువసేపే యున్నది.

హారేశ — నేను జూచినప్పుడు లేదు.

అమల — గడ్డము నెఱసి యుండెనా లేదూ ?

హారేశ — మునుపు నేను చూచినట్లు వెండిపలె నున్నది.

అమల — ఈరాత్రి నేనుగూడఁ గావలిమీఁదికి వచ్చెదను. అది మరలవచ్చునేమో!

హారేశ — తప్పక వచ్చును.

అమల — మిత్రవరులారా !

గీ- అదియు నిజముగ నాయయ్య ♦ యాకృతిగనె
యుండినట్లైన వినుఁడు య ♦ ముండు వచ్చి
వలద టన్నను దానినిఁ ♦ బల్కరింతు
నిదియు వెల్లడిసేయకు ♦ డింకమీరు.

ఈరాత్రి జరుగుదానినిఁ గూడఁ జూచి యూరకుండవలయును గాని యెవ్వరికిని దెలియనీయరాదు. మీ మేలుమఱవను లెండు. పొండు. కావలిసావడిమీఁద రాత్రి పదునొకండుపండ్రెండుగంటలకు నడుమ మిమ్ములనుగలిసికొందును.

అందఱు — చిత్తము రాజకుమారా!

అమల — మీకు మేలుగలుగుగాక ! పోయిరండు.

(హారేశ ప్రాంశుకపర్ణాదులు నిష్క్రమింతురు.)

ఏమిది ! అద్భుతముగనున్నది. దీనిసంగతి నంతను గని [illegible] !

చ. ఎదొ యొకమోస ముండనటె ♦ నెంచగ దండ్రి కృపాణపాణియై
పదిలము బూని రేల దల ♦ వాకిటఁ దా నడయాడునంట! హా!
హృదయము తాళుమా యిఁక నొ ♦ కించుకయంతట రేయి యయ్యెడుఙ్
బదపడి మోస మున్న నది ♦ పాఱికట మా నెవ రెంత దాచినన్.

పాపము బఱిద్దలుగాక మానదు. చూచెదనుగాక. (నిష్క్రమించును)

## తృతీయరంగము.

—:o:—

బాణునిగృహమున నొకగది.

ప్రవేశము:—లాఘవుఁడు, సుశీల.

లాఘ—నాపరికరము లన్నియు నావ నెక్కినవి నేఁ బోయి వచ్చెదను. సోదరీ! వీలగునంతవఱకు కుత్తరములును వ్రాయుచుండుదువా? లేక నిద్రపోవుచుండుదువా?

సుశీల—ఉత్తరములను వ్రాయకుండుదునా? అందులకు సందేహించుచున్నాఁడవా?

లాఘ—మ రేమియును లేదు గాని, అమలుని, వానియనురాగమును గేవల చిన్నాసముగఁ బాటింపవలెను గాని, నిశ్చయ మని తలంపరాదుసుమీ.

గీ. విను వసంత మందు ♦ వికసించునవపుష్ప
సౌరభము వసంత ♦ సమయముననె
గాని ఋతువుతోడ ♦ దానిసౌరభమును
మాయమౌ నటంచు ♦ మదిఁ దలంపు.

సుశీల—అమలునియనురాగము నంతటిదేనా?

లాఘ—అంతకంటె నెక్కువగఁ దలంపకుము. చిన్నతనము వదలి పెద్దతనము వచ్చినకొలఁది స్వభావముకూడ మార్పు జెందును. సహజముగ వయసువచ్చినకొలఁది మనోబుద్ధులు వికాసము నొంది విశాలము లగును. ఇప్పటి కాతఁడు నీమీఁద నిర్మలమైనప్రేమతో నుండనే వచ్చును కాని యతనియౌన్నత్యమును దలంచి నీవు వెనుకదీయవలసి యున్నది. అతనిమన సతనిస్వాధీనమున నుండనేలదు. అతనిజన్మ మట్టిది. దాని కతఁడు బద్ధుఁడై యుండవలయు. సామాన్యు లందఱివలె నాతఁడు స్వతంత్రుఁడు గా నుండరాదు. రాజ్యముయొక్క యోగక్షేమము లన్నియు నాతని కృత్యములపైఁబట్టి యుండును. కాఁబట్టి తా నెవ్వరికిఁ బ్రభువై యుండెనో వా రందఱియును

మతిని బట్టి గాని యాతఁడేకార్యమును స్వయముగా నెఱవేర్ప నొప్పుడడు. నిన్ను ప్రేమించితి నని యాతఁడు చెప్పిన నిది తాత్కాలిక మని మాత్రమే గ్రహింపవలయు దానికి బ్రజ లంగీకరింపనిచో నాతనివాగ్దానములు వ్యర్థము లగును బిమ్మట నట్టిపిశాస్వాముతో నీవును నీహృదయమును వాని కర్పింతు వేని దానివలనఁ గలుగు నీపరువునష్టమును విచారించి చూచుకొనుము. సుశీలా! ఈవిషయమునఁ గడు జాగ్రత్తగా నుండవలెను. ఉన్నంతమోహమును వెలిబుచ్చరాదు మోసమునకుఁ దొలఁగి సంచరింపవలయును. తమ వదనసౌందర్యమును బూర్ణముగ జంద్రునకుఁ గనఁబరచినను యువతుల కుచితమైనలజ్జ కొఱవడును. పుణ్యాత్ములకుఁగూడ నపనింద గలుగకపోదు. యౌవనాంకురములకు యువవిషవాయువులవలని భయము మెండు. గాన మెలకువ గలిగి మసలుకొనుము. శంక క్షేమాపాదకము. యౌవనము దనకుఁదా వశముగానిది.

సుశీల—నీవు గరపినయీనీతిని సదా నాహృదయమునకుఁ గావలిగా నుంచుకొంటును. కాని యన్నా!

తే. పరులకు నుపదేశ మొనరింపఁ ♦ బండితులంగ
నుందురందఱు సందియం ♦ బందు లేదు
స్వాచరణ మొనరింపగ ♦ సమయ మైన
మునులు గూడ నధీరులై ♦ పోవువారె.

అనెడువాక్యమును నీవు విస్మరింపకుమీ.

లాఘు—అమ్మాయీ! నీ కట్టిసంశయ మక్కఱలేదు—నేనువచ్చి చాలసేపైనది అదిగో తండ్రిగారిట్లు వచ్చుచున్నారు.

(బాణుఁడు ప్రవేశము.)

అధికస్య అధిక ఫలం. రెండవమారు మరల మీయాశీర్వచనపూర్వకముగ నాజ్ఞను దీసికొన నవకాశము గలిగినది.

బాణు—లాఘునా! ఇంకను నిక్కడనే యుంటివా? అయ్యో పద యోడమీఁదికి గాలి సవ్యముగా నున్నది. నీకొఱకుఁ గనిపెట్టుకొని యున్నారు (అని తల మీద చేయి యుంచి) నీకుసకలశుభములు గలుగుఁగాత! నేను చెప్పబోవునికిందియుపదేశములు నీమనస్సున వ్రాసియుంచుకొనవలయును.

గీ. పలుకకుము మనసునఁగల ♦ తలఁపుఁ బైకి
చేయకుము విచారింపక ♦ చెద్దయి మొద్ది

యందఱకు సులభుఁడవయి ♦ యలరఁజేయు
చుండి యెన్నఁడుఁ జులక గాఁ ♦ కుండవలయు.

మఱియు.

గీ. మిత్రగణములఁ బరికించి ♦ మేలువారి
యందు నెన్నఁడు విడరాని ♦ పొందు నెఱపు
గాని ప్రతికొత్తవానితోఁ ♦ గలసిమెలసి
చేరఁదీయుట కూడదు ♦ సేగి దాన.

క. కలహామునకు దిగుటొప్పదు
కలహామునకు దిగినవాని ♦ కడఁ జూడవలెన్
గలహించి నడుమ విడిచినఁ
జులకనఁగా నెంతు రీదు ♦ మూఢులు నిన్నున్.

ఆ. చెప్పువారికెల్లఁ ♦ జెవియొగ్గి వినవచ్చుఁ
గాని నీవు చెప్పఁ ♦ గా దెవరికిఁ
బరులయభిమతంబుఁ ♦ బలికించి పరికింపు
నీమతంబుఁ దెలియ ♦ నీకు మెపుడు.

ఆ. స్థితికిఁ దగినరీతి ♦ చేలముల్ ధరియింపు
వట్టిడంబ మెపుడు ♦ వలదు పుత్ర
వేష మెన్న మనుజు ♦ వెల్లడించును గాన
విలువ గాని వలదు ♦ భేషజంబు.

నీవు పోవుచున్న ప్రాంశుదేశవాసులం దుత్తము లిం దెక్కువయభిరుచిని విన్నాణమును గలిగియుందురు. మఱియు నింకొక్కటిఁ జెప్పెద వినుము.

ఆ. ఋణము సేయఁదగదు ♦ ఋణము నీయఁ దగదు
ఋణము మైత్రి, ధనము ♦ రెంటిఁ జెఱుచు
నంతెకాదు దాన నమిత ♦ వ్యయం బబ్బుఁ
గాన ఋణము విడిచి ♦ జ్ఞాని వగుము.

ఇంకొక్కముఖ్యాంశము వినుము.

ఆ. నీవు నీయంతరాత్మకు ♦ నియతితోడ
సత్యముగ నున్న నొరులకు ♦ సత్యముగనె

యుందు విధి మదినుంచుము ♦ పొందుగాను
పోయిరమ్ము కుమారక ♦ పోయిరమ్ము.

నా యుపదేశము సమయము వచ్చినప్పుడెల్ల నీ కుపకరించు గాక!

లాఘు—అతివిధేయుఁడనై సెలవుఁగొనుచున్నాఁడ.

భాను—సమయమైనది. నీ సేవకులు నీకై వేచియున్నారు. పొమ్ము.

లాఘు—సుశీలా! పోయి వచ్చెదను. నేను జెప్పిన మాటలు మఱచిపోకుమీ.

సుశీల—నీవాక్యమాణిక్యములను నా మనఃపేటికయందు భద్రపరచి యుంచుకొందును. దాని తాళము నీకడన యుంచుకొనుము.

లాఘు—పోయివచ్చెదను. (నిష్క్రమించును.)

భాను—సుశీలా! నీకు వాఁడు చెప్పినదేమి?

సుశీల—ఏమియును లేదు. అమలవర్మ మాట కొంచెము చెప్పినాఁడు.

భాను—ఓహో! బాగుగ జ్ఞప్తికిఁ దెచ్చినదానవు. అమలవర్మ నీతో నేకాంతముగ భాషించుచుండు ననియును, నీవు వానితో విరాళముగఁ బలుకుచున్నట్లును వినియున్నవాఁడను. ఇది నిజమైనయెడల నీ కొక్క సంగతి ముందుజాగ్రత్త కొఱకుఁ జెప్పవలసియున్నది. నావంటివానితనూజాత వగు నీకుఁ దగినమర్యాద యెట్టిదో నీవు స్పష్టముగా నెఱిఁగియుండవు. మీయిద్దఱకును, జరుగుచున్న వృత్తాంత మేమో నాకు నిజము చెప్పుము.

సుశీల—ఈనడుమ నాతఁడు తనకు నాయందుఁ గలప్రేమను బలుమారులు తెలుపుచు వచ్చినాఁడు.

భాను—ప్రేమయా? ఆహా! అనుభవము లేనిదాన వగుటంజేసి ముద్దరాలవువలె మాటలాడుచున్నావు. అదియంతయుఁ బ్రేమయనియే నమ్ముచుంటివా?

సుశీల—జనకా! ఏమి గాఁదలంపవలయునో నే నెఱుంగను.

భాను—అయ్యో! నేను జెప్పెదను వినుము. ఇదియంతయు నిక్కమైనప్రేమయనియే యనుకొనుట నీగోలతనమును దెలుపుచున్నది. ఇది నిజము కాదు. నీ వీవిషయమునఁ జాల మితభాషిణివిగా నుండవలెను. చులకనగా నుండరాదు. లేకున్న నామర్యాదను బోగొట్టుదువు.

సుశీల—తండ్రీ! ఆతఁడు సగౌరవముగ నన్నుఁ బ్రేమించి నాప్రేమ నభిలషించినాఁడు.

బాలు—అది కేవలము దంభముగాని వాస్తవము కాదు. ఓసి! వెఱ్ఱిదానా!

సుశీల—అయ్యో! తండ్రీ! ఆతఁడు పలికినపలుకులెల్ల దైవముఖముం జూచి చెప్పుచున్న ట్లొట్టుపెట్టుకొని చెప్పినాఁడు.

బాలు—ఇవియన్నియు నీవంటిపక్షులను బట్టుకొనుటకు వలలవంటివి. ఇవి

ఉ. బాల! వివేకహీన వగు ♦ పక్షిని నిన్ను వశంబొనర్పఁగా
గాలములే సుమీ యతఁడు ♦ కాముకుఁడై వచియించుబాస లో
గోల! వినూత్నయౌవనని ♦ గుంభిత మైనప్రమాణవాక్యముల్
జాలములన్ వలెన్ దలఁపు ♦ సత్యముగా వవి యెన్నఁడున్ సుతా.

మిణుగురుపురుగున నగ్ని యున్నదనుకొనవచ్చునా! మఱియు

తే. గీ. నేఁడు మొదలు లాకుమారుంకు ♦ నిన్నుఁ గోరు
ప్రేమవాక్యంబులకు వెల ♦ ప్రియతమంబు
గాఁ నొనర్పుము చౌకగఁ ♦ గ్రయపరపకు
మఱియు నాతనిదృష్టిని ♦ దఱచుపడకు.

ఏమంటివేని

ఆ. వె. అతఁడు పడుచువాఁడు ♦ నవని నేలెడువాఁడు
నిన్నె నమ్మియుండు ♦ నన్ననియతి
లేదు వానిలీల ♦ యేదైనఁ గావచ్చు;
నమ్మకమ్ము వాని ♦ నాకు మారి.

ఆమాట లెట్టివంటేని.

క. మాపరకులె మంచివి యని
గాసటబీసటలుపలికి ♦ కార్యాంతమునన్
దోసము వెల్వడునట్టిదుఁ
బాసిజనంబులను బోలు ♦ వాగురలు సుమీ.

గనుక నే సానిమాటలవలె నాపాతమధురములై మక్కువఁ గలిగించి తుదకు మోసపుచ్చును గాఁబట్టి నామాట విని యిప్పటినుండి యతనితో మాటలాడి నీకాలమును దుర్వినియోగపరపకుము. నే నిదె చెప్పుచున్నాఁడను. నీమార్గమును మరలించుకొనుము.

సుశీల—తండ్రీ! నీకు విధేయురాలను.

## చతుర్థరంగము.

### పహారాసావడి.

అమలు—అబ్బ! చలికొఱుకుచున్నది.

హరేశు—ఈదరగాలి మిగుల శీతలమును వీచుచున్నది.

అమలు—ఇప్పు డెన్నిగంట లయినది.

హరేశు—పండ్రెండు దగ్గరకావచ్చును.

మార—కాదు. పండ్రెండు గొట్టినది.

హరేశు—నిజముగా? నేను వినలేదు. అట్లయిన గ్రహము వచ్చెడువేళ యయినది.

( తెరలో తూర్యధ్వని, ఫిరంగులచప్పుడు )

రాజకుమారా! ఇది యేమి?

అమలు—నేఁటిరాత్రి రాజుగారు మధుపానోత్సవమును సాగించుచున్నారు. వారి మధుపానసామర్థ్యము నీవాద్యవిశేషములు ఘోషించుచున్నవి.

హరేశు—ఇది యొకయాచారమా?

అమలు—ఆచారమే. కాని యిది యాచరణముచేతఁగంటె నతిక్రమణముచేత నెక్కువ గౌరవింపఁబడునని నాయభిప్రాయము. దీనివలన మనదేశమునకుఁ దలవంపులు గలుగుచున్నవి. తోడిదేశములవారు మనలను త్రాగుఁబోఁతులని యెంచి మనపేరుప్రతిష్ఠలను బాడుసేయుచున్నారు. ఈయొక్క దుర్గుణమువలనను మన మెట్టిఘనకార్యము లొనరించినను రాణింపకున్నవి.

తే. గీ. యోగ్యగుణములు మన కెన్ని ♦ యున్నఁగాని
వాని లోకము గణియింప ♦ మానివేసి
స్వకృతముననైన దైవంపు ♦ వికృతినైన
దోసమొక్కటి కల్గిన ♦ దూఱుఁజూపె.

మంచి యెంతయుండినను జెడు గొంచెంతయుండినచో దానినంతను బాడుచేయును.

హరేశు—చూడు! రాజా! అది వచ్చుచున్నట్లున్నది,

సీజరుయొక్క మొదటిదండయాత్ర యిదివఱకుఁ దెలుపఁబడెను. ఆదండయాత్ర బ్రిటనుద్వీపముయొక్క గుట్టుమట్టులను దెలిసికొనుటకే యుద్దేశింపఁబడినదని యింతకుఁబూర్వమే చదువరులు గ్రహించియుందురు. దేశమునుజయింపవలెనను కుతూహలముతోఁ బ్రారంభింపఁబడిన రెండవదండయాత్రనుగుఱించి యిందుఁ దెలిసికొందము.

శీతకాలముసమీపించుటచేఁ దనదేశమున కాతఁడు వెడలిపోయెనని చదువరులకుఁ దెలియునుగదా! ఆకాలము నాతఁడు వ్యర్థపుచ్చలేదు. తనదండయాత్రకు వలయునన్నాహములను బాహుళ్యముగ నాతఁడు చేయుచుండెను. నిరుపయోగకరములుగాఁ జేయఁబడిన యోడలు బాగుచేయఁబడెను. నూతనమైనవి కట్టఁబడెను. నూతనముగఁగట్టువానిని సరకులను దీసికొనివెళ్లుట కుపయోగించువానిగఁ జేయించెను. ఈయోడలన్నియు ఫ్రాన్సు (France) దేశములో బోలోను (Boulougne) నకు సమీపముగనున్న రేవునందు జేరునటుల నేర్పఱచెను. తిరుగఁబాటుజేసిన కొన్నిజాతులమనుజులను శిక్షింపవలసినయగత్యము తటస్థించుటచేతను ప్రతికూలమైన గాలి వీచుటచేతను కొంతయాలస్యమయ్యెను. తుదకు బ్రయాణము కాదలఁచుకొనుచున్నసమయమున నొకచిన్నియంతరాయము కలిగెను. తాను గాలుదేశమును విడిచి బ్రిటనునకు దాడివెడలుచున్నాడుగావున నాబ్రిటనులకు బంధుగులైనగాలులు తానుబ్రిటనులోనున్నప్పుడు తిరుగఁబడిన యెడల మఱల మోసమువాటిల్లునను భీతిచే సీజరు వారినమ్మకమును సామంతషును వ్యక్తపఱచుటకుఁ గొందఱిని జామీనుగా నీయవలయునని కోరెను. ఆతనికోరికప్రకారము కొందఱు గాలులను వారిచ్చిరి. కాని ప్రయాణముకాబోవుచున్నసమయమున నందులో నొకఁడు పారిపోవుటచే వానిని బట్టుకొనుటకు సీజరు తనప్రయాణము నాపివేసెను.

అంతరాయములన్నియుఁ గడచి సీజరు బయలుదేరునప్పటికి జూలై 20 తేదీ వచ్చెను. ఆతని సైన్యమునం దారువందల యోడలు గలవు. అతనితోఁగూడ స్నేహితులవలె వచ్చు నితరుల యోడలు గలిసిన నవి యెనిమిదివందలయ్యెను. అందు సుమారు ముప్పదివేల పదాతులును రెండువేల గుఱ్ఱపుదళమును గలిగియున్న యైదుపటాలము లుండెను. ఓడలన్నియు లంగరునుదీసి బయలుదేరునప్పటికి సూర్యాస్తమయమయ్యెను. ఆ దేశములో నాకాలమున సూర్యుఁడెనిమిదిగంటల కస్తమించును. వారు బ్రిటనును సమీపించునప్పటికి నుదయము మూడుగంటలయ్యెను. ఆకాలములో నప్పుడే సూర్యోదయమగును. గడచిన వత్సరమున వారు రేవును జేరినస్థలముననే మరలఁ జేర బోయిరి. వారి నావికాసైన్యమును జూచి దేశీయు లభ్యంతరమును గలుగఁ జేయుటకు జంకి యూరకొనిరి. సీజరు కాలయాపనమును జేయక భూమిమీఁదఁ జేరుటతోడనే తన సైన్యము విడియుటకుఁ దగిన తావునైన నిర్మించుకొనక పండ్రెండుమైళ్ల దూరములో దూలములతోఁ గట్టఁబడి కందకములను గలిగియున్న శత్రువులయొక్క కోటను ముట్టడించుటకై వెడలెను. సీజరాకోటను బట్టుకొనినవిధము కూర్మపద్ధతి యనఁబఱఁగునట. అది యీ దిగువవిధముగ వర్ణింపఁబడియెను.

"ఆతఁడు తన సైన్యమునంతను నొకపంక్తికివెనుక రెండవపంక్తియు దానితరువాత మూడవపంక్తియు నీవిధముగనుండునటుల నియమించెను. ఈపంక్తులలో నొకదానియొక్క భటులవెనుక మిగిలిన పంక్తులభటులు వరుసగానుండుదురు. ప్రతిపంక్తిలోని భటులు నొకరికొకరు మూడడుగులదూరమున నుందురు. ఈనియమము మొదటిపంక్తిలోనివారికి లేదు వారొకరికొకరు దగ్గఱగానుండి తమడాలుల నొకదానిని రెండవదానితో గలిపి వెనుకనున్నసైన్య మంతయున్న

దో తెలియకుండునటులఁ జేసెదరు. ఇందువలన మొదటిపంక్తియం
తయు క్రమముగానున్నను రెండవపంక్తినుండి చివరవఱకును ప్రతి
యిద్దరుభటులమధ్యమునను మూడడుగులవెడల్పుగల మార్గమేర్పడె
ను. ఈమార్గమునుండి సామాన్యసేవకులు మట్టినితుక్కును దెచ్చి ప్రో
వుచేసి పల్లముగానున్న భూమినంతను నెత్తుచేయుచుండిరి. ఇట్లుపనిచే
యువారికి శత్రువులవలనిభయ మేమియు లేకుండుటకై వీరికి రెండు
వైపులనున్న భటులును దమడాలులను తమశిరములపై నడ్డముగా గొ
డుగులవలె వారికిఁ బట్టిరి. ఇటులాసేవకులు రెండుపంక్తులమధ్యమున
నున్న పల్లము నెత్తుచేసినతోడనే భటులందఱు నొకపరి కుడివైపున
కును మఱియొకపరి యెడమవైపునకును దప్పుకొని పల్లముగనున్న
భూమినంతను గప్పివేయుట కనుకూలముగఁ జేసిరి. ఈవిధముగ నచి
రకాలములో నాయగడ్తనంతయు వారు గప్పివేసినతోడనే శత్రువుల
పైకిఁ జొచ్చుకొని యెదిరించిరి. వారు వీరిధాటికోర్వలేక పారిపోవుట
చే సులభముగ నాకోట పట్టుబడెను.''

ఆపట్టుబడినస్థలమును బలపఱచవలయునను నుద్దేశముగలవాఁ
డై సీజరు పలాయితులగు శత్రువులను దనసైన్యము వెంబడించుట
కనుజ్ఞయీయలేదు. అయినను మఱునాఁడు కొలఁదిసైన్యము శత్రు
లను వెంబడించుచు గనుచూపుదూరములోనుండఁగా గడచినరాత్రి
యందలి తుపానుచే నోడలకుఁ జాలనష్టము గలిగెనని వర్తమానము
వచ్చెను. అందుచే సీజరు తనసైన్యమంతయు వెనుకకువచ్చి యోడల
ను బాగుచేయునటు లాజ్ఞాపించెను. ఈపని పదిదివసములవఱకు వారి
కి శ్రమమును గలుగఁజేసెను. అటుతరువాత వారు తామదివఱకు
వెడలిన ప్రదేశమునకుఁ బోయిరి. ఇంతలో నాబ్రిటనులు పెక్కు
సైన్యముతో " కాస్వాలన్ " (Caswallon) అను నొకరాజును నాయ

కునిగఁ జేసికొని శత్రువులనెదిరించుటకు సిద్ధమైయుండిరి. మొదట బ్రిటనులే జయమునుబొందుటచే శత్రుసైన్యమును రెండుభాగములుగఁ జేసిరి. కాని రోమనులకు మఱికొంతసైన్యము వచ్చినతోడనే వెనుకకు మఱలవలసినవారైరి. అయినను వారు భయంకరమైన శత్రువులని రోమనులు గ్రహించిరి. వారియాశ్వికదళమునందలి సైనికులు గుఱ్ఱములమీఁదనున్నను భూమిమీఁదనున్నను నొకేవిధమైన చురుకుదనమును జూపుచు దఱచుగా దమయుద్ధపద్ధతులను మార్చుచు రోమనులకు భీతిని గొలుపుటయేకాక వారిసైన్యమపారమై యక్షయముగ నున్నటుల రోమనులకు దట్టెను.

వారిటుల బోరాడుచున్నను బహిరంగముగ క్రమమైనపద్ధతిని యుద్ధముఁగావించిన యెడల రోమనులకుఁ దీసిపోయెదరు. కాని పాపము వారారహస్యమును గ్రహియించలేకపోయిరి. మొదట వారికిఁగల్గిన స్వల్పజయమున కినుమడించిన ధైర్యముతో శత్రువులనెదుర్కొన నెంచుచున్న సమయమున నాప్రాంతములయొక్క జాడలను దెలిసికొని రమ్మని సీజరుపంపిన కొలఁదిసైన్యము వారికి గోచరమయ్యెను. వెంటనే వారు దానిపైఁబడి సులభముగ నోడించిరి. రోమనుసైన్యమంతయు నిటులనే యుండునుకాబోలునని వారనుకొని పెద్దసైన్యమును దాకిరి. అందుచేఁ బూర్తిగ నోడిపోయిరి. దేశీయులు పలువురు ధైర్యవిహీనులై యెక్కడివారక్కడకుఁ బారిపోయిరి. అప్పుడుచేరినంతసైన్యమును మఱలనెప్పుడును బ్రిటనులు ప్రోవుచేయలేకపోయిరి.

అంతటితోనూరకొనక సీజరు కాస్వాలను నతనిదేశములోనే యోడించవలయునను సంకల్పముతో బయలుదేరెను. అటులఁగావించుట కాతఁడు థేమ్సునదిని దాటవలసియుండెను. ఆనదికొక్కటియే పాటిరేవుండెను. ఆరేవునకావలప్రక్కను శత్రువులు కాచుచుండుట

యేకాక యాతట్టుననున్న నదియొడ్డునఁ గొన్ని నీటిలోఁ గనఁబడునట్లును గొన్ని కనఁబడకుండునట్లును గొయ్యలను బాతించిరి. మొదట నాశ్వికదళమును బంపి వెనుక పదాతులను బంపవలెనని సీజరుయొక్క యుద్దేశము. కాని యాతురతఁగలిగిన యాపదాతులంతకాలము వేచియుండలేక యశ్వములతోడనే తాముకూడ నీటిలోనికి దుమికి కుత్తుగబంటిగనీరువచ్చుచున్నను సరకుగొనక రెండవయొడ్డును జేరిరి. ఆశ్వికులును కాల్బలము నొక్కమారుగ దాకుటచే బ్రిటనులు తాళలేక తమస్థానమును విడిచి పాఱిపోయిరి.

రోమనులతోఁ గ్రమమైన యుద్ధమునకు దిగినయెడల లాభము లేదని "కాస్వాలను" గ్రహించెను. అందుచేఁ దనసైన్యము నంతయుఁ బొమ్మని యాజ్ఞాపించి సీజరునుసైన్యమును వెడలుచున్న మార్గముపొడుగునను మానవునకుపయోగించు పదార్థములేవియు లేకుండునటులఁ జేసి రోమనుసైన్యములోని పెద్దసమూహమునుండి యిరుప్రక్కల కేదైనచిన్నభాగము వచ్చుచుండినయెడల వెంటనే వారిని సంహరించుచు నీవిధముగ శత్రువులకుఁ గష్టములఁ గలుగఁజేయఁజొచ్చెను. బ్రిటనులలో నైకమత్యవిహీనతయు నసూయాపిశాచమును సీజరునకు మిక్కిలి సాయమొనరించినవి. విదేశశత్రువునకీరెండేకదా పరమోపకారులు. ఏలయనఁ బూర్వము "కాస్వాలను" పెక్కుయుద్ధముల నొనరించి పరిసరములలోని రాజులనోడించి యుండుటచే వారొక్కరొక్కరుచు సీజరునకు సాయముఁగావింపఁజొచ్చిరి. అందుముఖ్యముగా బ్రిటనుయొక్క దక్షిణభాగమునఁ గాపురముచేయుచున్న "ట్రినోబాంటిస్" (Trinobantes) అను జాతివారు ముఖ్యులు పూర్వమీతఁడు వారినేతనుజంపి సన్నిహితజ్ఞాతిని దూరదేశములకుఁ దరిమివేసెను. ఇప్పుడాజ్ఞాతి వచ్చి సీజరుశరణమునుగోరి యాతనిశిబిరమును జొ

చ్చెను. ఆతనికి భయమిడి యాతని నింటికిబంపి వారిజాతివారందఱును విశ్వాసపాత్రులుగ నుండుటకై పలుబందుగురిని హామీగానిచ్చుటకుఁ గోరెను.

వీరిపద్ధతి నితరజాతులవారుకూడ ననుకరించిరి. ఇటుల ననేకు లాతనియొద్దకు వచ్చుటచే వారివలన 'కాస్వాలను' యొక్క పట్టన ప్రాంతముల రహస్యమును దెలిసికొని యాతనిపై దాడివెడలెను. ఆ దినములలో బ్రిటనులోనిపట్టనము లీదినములలోవానివలె నుండెడివి కావు. కొందఱుజను లొకయడవిలోఁ జేరి చుట్టును గోడలును కందకమును గట్టుకొనినభాగమున కొకపట్టనమను నామధేయ మొప్పుచుండెను. కాస్వాలనుయొక్క పట్టనముగూడ నీరీతిగనే కన్పట్టుచుండెను. అయినను సీజరువెడలునప్పటి కాప్రదేశము మిక్కిలి బలముగ సంరక్షింపఁబడుచున్నదని యాతఁడు గ్రహించెను. వెంటనే రెండు ప్రక్కలనుండి కోటను బట్టుకొనుటకు సీజరు తనసైన్యమున కాజ్ఞ యిచ్చుటచే శత్రువులు నిలువలేక కోటను విడిచిపెట్టి దూరముగఁ బోయిరి. అట్లువెడలుచు ననేకములైన పశువులను విడిచిపెట్టిరి.

ఇదియిట్లు జరుగుచుండ శత్రువులయొక్క దృష్టిని మరల్చునుద్దేశముతో 'కాస్వాలన్' తనస్నేహితులైన కొందఱునాయకులతో సీజరు మొదటవిడిచిన శిబిరమును బట్టుకొండని యాజ్ఞాపించెను. కాని యాదాడి జయప్రదము కాలేదు. ఇఁక గార్యములేదని బ్రిటనులు గ్రహించి సంధిప్రయత్నములకై రాయబారులను బంపఁజొచ్చిరి.

'కోమియస' నునాతఁడొకఁడు గాలుదేశస్థుఁడు బ్రిటనులచేఁ బట్టువడి వారిస్వాధీనమం దున్నాఁడని చదువరులకుఁ దెలిసియేయున్నది. ఇపుడు బ్రిటనులాతని సీజరుయొద్దకు వెడలి సంధికుదర్చుకొని రావలయునని పంపిరి.

# పంచమాధ్యాయము.

## ఉత్తరము.

పురుషసింహునితండ్రి కేబదియేండ్లు నిక్షేపమువలె జఱిగిపోవఁగా నాయనకర్మదినములుమాత్రము నిక్షేపముగా జఱిగిపోవకుండునా? పది, పదునొకండు, పండ్రెండు, దినంబులెల్లను బిత్రుదేవతాసంతృప్తిగ బ్రాహ్మణసంతర్పణము సేయఁబడినది. వచ్చినవారెల్లఱు, విన్నవారెల్లఱుఁ గుఱ్ఱవాఁడైనప్పటికి నేలోపములేకుండ యథావిధిగఁ దండ్రిని దరింపఁజేసినవాఁడు పురుషసింహుఁడని మిక్కిలి ప్రశంసించిరి. ఏకడనైనఁ జంద్రశేఖరరావుపంతులుగారు పట్టనవాస్తవ్యులగుటచే నేమిటికీవెఱ్ఱిఛాందసమని యనినప్పటికిఁ దల్లికయ్యవి యెల్లయసమ్మతమని పురుషసింహుఁడు శ్రోత్రియుతెలుంగునఁ దండ్రికి దినవారక్రియలు నిర్వర్తించెను.

పండ్రెండవదినముమధ్యాహ్నము భోజనములైనవి. పదునొకండునాళ్లనుండి గంధపుబొట్టేకాని యక్షింతలెఱుంగని పురుషసింహుని మోమున నాఁడు దిరిగి యక్షింతలకళ ప్రకాశించినది బ్రాహ్మణులనందరను సత్కరించి యనిపి స్థిమితముగ మామగారితో నాతఁడరుగుపైఁ గూరుచుండెను. అట్లు వారిరువురును గూరుచుని నిశ్చింతామనస్కులై యుండునంతలోఁ జేరువగ్రామములోనున్న "తపాలాఫీసు" నుండి "తపాలావాడు" వచ్చి యుత్తరమొండు పురుషసింహునకిచ్చెను. ఇచ్చినవానితో "రామస్వామీ! ఇంట్లోరెండుముక్కలు పెడుదురు. వెళ్లిపోవునప్పుడు పట్టుకొని మఱిపొమ్మని యతనిఁబంపి యెవరికడనుండి వచ్చెనో యాలేఖయని యోజించుచు పైపేరునఁగల యు

క్కారముల పొందిక గుర్తించుచుఁ బురుషసింహుఁడు దానిని చించెను. చించుచుండ మామగారు "మీయూరను నీనాఁటికైనను తపాలాఫీసు లేదే? ప్రతియూరను సరియైన చోట తపాలాఫీసు నుండవలసినదేమతి" యనియాడుచు నాయుత్తర మెవరికడనుండి వచ్చినదని యడిగెను. పురుషసింహుఁడును దుదకంటు నాయుత్తరముఁ దనలోఁజదువుకొని దరహాసితవదనుఁడగుచు, మామగారి కీక్రిందఁ జెలంగున సూచించి యుత్తరముఁజదివి వినిపించెను.

"మామగారూ! మిత్రులెందఱో మిత్రులమని యందురు కాని యెక్కడో కొందఱుమాత్రమే నిజమైన మిత్రులు సుమండీ! ఈయుత్తరము నాకు వసంతసేనుఁడను నాస్నేహితుఁడు వ్రాసినది. ఈతనికిని నాకును స్నేహము మొన్నపోయిన వేసంగిశెలవుల వెనుక కలిసినది. ఎట్లుకలిసినదో కాని యప్పటినుండియు నతఁడును నేనును తరగతినొక్కచోటనే కూరుచుండి యింటికడఁగూడఁ గలిసి చదువుకొనుచున్నవారము. చిరపరిచయులగు మిత్రులనందఱఁ ద్రోసిపుచ్చి నాకతఁడచిరకాలములోఁ జిరపరిచితుఁడయ్యెను. అతఁడు నన్ను మఱచిపోక వ్రాసిన యీయుత్తరమును విన్న నెటువంటిస్నేహితుఁడో తెలియక మానదు.

"ప్రియమగు నాప్రాణమిత్రమా!

నీవానాఁడు మీతండ్రిగారికిఁ జాలజబ్బుగానున్నదని కంటఁదడిపెట్టుచు నాతోఁ బాఠశాలలోఁ జెప్పి మీయూరికి వెళ్లినదాది నాకుత్తరము వ్రాసినాఁడవు కావు. మీతండ్రిగారి కెట్లున్నదోయని తెలిసికొనుటకు నామనస్సు పరితపించుచున్నది. నింపాదిగానున్నదని తలంతును.

నీవు వెడలి యప్పుడే పదియేనుదినములైనవి. వెడలునప్పుడు

శలవొకవారమునకుమాత్రమే పెట్టి వెడలితివి. తిరిగి వారమునకు శలవుపెట్టినవాడవుకావు. నేను నీతండ్రిగారికిఁ బ్రాణముమీఁదికి వచ్చి యుండుటచే వెళ్లియుంటివని చెప్పి యీవారమునకుఁగూడ మిక్కిలి మంచివారలగు మనయుపాధ్యాయులతోఁ జెప్పి శెలవిప్పించితిని. సోమ వారమునకుఁ దప్పక రావలసియుండునని మఱిమఱి చెప్పినారలు.

ముందువారము మనకుఁ దరగతిపరీక్షలు ప్రారంభమగుచున్నవి. వానికి లేనిమొదలుఁ దుదిపరీక్షకుఁ బాపమని ప్రధానోపాధ్యాయులు మిక్కిలిపట్టుదలతో భయపెట్టుచున్నారు. కావున నీవెట్లైనను త్వరలో బయలుదేఱి రావలసియుందువు. అత్యవసరమైన యీదినములలో నీకుఁ జదువుచెడుచున్నదని నాకు విచారమగుచున్నది. ఎట్టి కారణముచెప్పినను వినఁగట్టి ప్రధానోపాధ్యాయుఁడు మనవాఁడని నీకుఁదెలియును కదా? త్వరలో వచ్చువాఁడవని తలంతును.

నీయారోగ్య మభిలషించుచు విరమించుచున్నాను.

ఇట్లు ప్రియమిత్రుఁడు

వసంతసేనుఁడు."

ఆయుత్తరము వినినతోడనే చంద్రశేఖరరావుగారును గొంచము స్మృతినభినయించి, „అవునోయి! పురుషసింహా! ఈవిద్యార్థియే మైయుండును. పోయినశనివారము మనయింటికివచ్చి బావగారికెట్లున్నదని యడిగెను. అప్పుడతగా నేనతనిని బరిశీలింపలేదు గాని కుఱ్ఱవాఁడు బుద్ధిమంతుఁడుగను స్నేహపాత్రుఁడుగను బొడఁగట్టెను. అదివిని పురుషసింహుఁడు „బుద్ధియేకాదు ప్రతివత్సరము సరిగాఁ బరీక్షలను త్తీర్ణుఁడగుచుఁ దెలివితేఁటలుగ చదువువాఁడు కూడను. అతనిసాయముననైన నీయేఁడు నేను తప్పక పరీక్షను కృతార్థుఁడనగుదునను నమ్మకము గలదు" అనియనియెను. ముందువారమునుండియే మాపరీక్షలని

నీమిత్రుఁడు వ్రాసెఁగాదా యనిపురుషసింహుని రెట్టించి మామగారడిగెను. "అవును. అందులకే యాలోచించుచుంటి" నని పురుషసింహుఁడు మాఱుచెప్పెను.

అంతటఁ జంద్రశేఖరరావుగారు "అబ్బాయీ! నేనుమనవాళ్లు యీరాత్రి నెలపొడువఁగానే బయలుదేఱి యింటికి వెళ్లవలెనని చూచుచున్నాము" అని యింకను నేమేమియో యనఁబోవుచుండఁ బురుషసింహుఁ డడ్డమువచ్చి "యిట్టియవస్థలో మానాళ్లైననాగక వెళ్లుట న్యాయ్యమా? మీరుఁ దొందఱని నేనెఱుఁగుదును. కాని మా యమ్మ యందులకియ్యకొనునా?" అని దీనవదనుఁడగుచుఁ బలికెను. దానఁ జంద్రశేఖరరావుగారు కొంచముసంకోచించి యిట్లను. "అట్లు గాదోయి! ఇప్పుడు కాకినాడలో నాలుగురచ్చలు పనిచేయుచున్నవి. ఊపిరాడకుండ పనియున్నది. ఎక్కడికక్షదారుల నక్కడపెట్టి రెండునాళ్లలో వచ్చువాఁడనని యొకనాటిపని—నీవెఱుఁగుదువుగా—చిదానందరావున కొప్పఁజెప్పి వచ్చినవాఁడ. మఱియు నీనడుమ మండలసభ్యునిగాఁ గూడ నన్ను నియమించియున్నారు. దానిసమావేశము ముందువారము గానున్నది. ఇఁక నన్నాపరాదు. పోనీ! మీ యత్తగారినుంచుదుమా యన నింటఁగలచిక్కులు నీకే తెలియును. దాని మీఁదిప్పుడు రెండవకుఱ్ఱవానికిఁ గొంచము జ్వరము దగులుచున్నది. పెద్దమ్మాయి కొప్పఁజెప్పి వచ్చితిమి. అగుటకెంతమాత్రము వీలుండదు. మఱియు నీకుఁ బరీక్షలు ముందువారమేయని వసంతుఁడు వ్రాసి యుండెనుగదా! మీయమ్మతో నివియన్నియు నాలోచించి నిన్ను కూడా మాతోఁ దీసికొని వెళ్లుసంకల్పముతో నున్నవాఁడను. ఇప్పుడు మాతరిము నాగ్గతిమికాదని మఱియొకలాగున ననుకొనకుఁడు. ఇంతకు నుండి చేసెడిదేమి? ఇదివఱకు బావగారున్నప్పుడు పనిచూచే ' గుడు

స్త్రా' యిప్పుడును బనిచూచుచుండును. వచ్చునెడల తలుపుఁదాళము వైచి మీయమ్మను చెల్లెలినిగూడ కాకినాడదీసికొని వెడలుదము.'' అనుచుఁ బురుషసింహుని లేవనెత్తి లోపలికిఁ దీసికొనివెళ్లెను.

---

## షష్ఠాధ్యాయము.

### చంద్రశేఖరరావుగారు.

చంద్రశేఖరరావుగారు కాకినాడలో ఖ్యాతిగన్న న్యాయవాదులు. అక్కడఁ గలన్యాయవాదులందఱకు నాయనయే ప్రముఖులని చెప్పవచ్చును. విశేషముగ ధనమార్జించిరి. చిన్ననాటఁగోలె వారికి సహజముగా మేధాశక్తి యెక్కుడు. పట్టపరీక్షలో గణితశాస్త్రమం దాంధ్రరాష్ట్రమునకంతకు మొదటివారుగ నుత్తీర్ణులై సువర్ణపతకము వడసిరి. అనంతరము న్యాయవాదిపరీక్షనుగూడ రాజధానికంతకుఁ బ్రథములుగా నుత్తీర్ణులైనవారికంటె నొకకొద్దిగుణములు తక్కువవచ్చియుండుటచే ద్వితీయులుగఁ గృతార్థులైరిగాని లేకున్న నందునను నద్వితీయులనియేఁ జెప్పుకొనవలసినవారు దానికిఁ గారణము బహుశః చంద్రశేఖరరావుగారిలోపముకంటెఁ బరీక్షకులపక్షపాతమై యుండనోపు. వయస్సు నలుబదికి నొక్కవత్సరము తక్కువయుండునుగాని యెక్కువుండదు. వీరు న్యాయవాదిపదవిని నిలువఁబడినదాది దావాలుపట్టఁబ్రారంభించినదిమొదలు కొంచముగనో గొప్పగనో పేరుమోసి నానాటికి యశోలత యల్లుకొనియెను.

ఆయనను మూఁడేండ్లక్రిందట ప్రజలు మండలసభ్యునిగా నెన్నుకొనిరికాని మఱుచటిమాటు ప్రజలకనుకొన్నంతయుపకారి కామిని

తత్పదచ్యుతుఁడాయెను. అయినప్పటికిఁ బ్రభుత్వమువారు చంద్రశేఖరరావుగారిని మండలసభ్యునిగాఁ జేర్కొనిరి. కాకినాడపురమందలి శాఖాశాలలఁ గలకార్యనిర్వాహకసభ్యులలోఁ జంద్రశేఖరరావుగారొకరు. మఱియుఁ బ్రతిసమాజమునందును బ్రతియాందోళనమందును నాయకుని ముందంజవేయుచు నుపన్యాసములు మున్నగునవి యిచ్చుచుండును. ఆయనయెదుట నెల్లఱు వినమ్రులై యుండవలసినదే?

సంఘమందింతగౌరవము వహించువారైనప్పటికిని, నొరులకలహములు జక్కదిద్దువారైనప్పటికిని, చంద్రశేఖరరావుగారు స్వగృహపరిపాలనమం దంతసమర్థులు కారు. వారియింట నొక్కముసలి వంటలక్క కలదు. ఆమెను చంద్రశేఖరరావుగారిభార్యయును దఱుచు పడదు ఆమెను పొమ్మనలేదు. ఏమన చంద్రశేఖరరావుగారిచిన్ననాటనుండి యావృద్ధురాలాయిల్లు కనిపెట్టుకొని యున్నదట. ఆమె చంద్రశేఖరరావుగారి పెండ్లి, చంద్రశేఖరరావుగారిభార్య కాపురమునకురావడము సమస్తము నెఱింగిన పురాతనపుమనిషి. మఱియు నామె కతమున కుటుంబమంత యభివృద్ధినున్నదని వారినమ్మకము. ఆ కారణమున నామెను చంద్రశేఖరరావుగారౌననరు కాదనరు. మఱియు నాముసలిమాలిదకు మఱియెవ్వరును లేరు. ఆమెకు చంద్రశేఖరరావుగారిచ్చుజీతముకూడ నామెకొఱకు వినియోగించుకొనక చంద్రశేఖరరావుగారిపిల్లలకే పుట్టినాళ్లకని, పండుగులకని, యిందులకని, యందులకని, పరికిణీగుడ్డలకనియో చొక్కాగుడ్డలకనియో వెచ్చించుచుండును. అందుచే నామెయెడ మఱియువిశ్వాసము. పాపము! వెంగలివృద్ధురాలొక్కనాఁడు చంద్రశేఖరరావుగారిభార్యతోఁ జెంబులు తోలుచునప్పు డాచారముతక్కువయైనదని యత్తగారివలె కలహమాడ నామెనుతనయిల్లువిడిచి పొమ్మని గట్టిగ కసరి తూలనాడెను. దానఁ

గోపముఁ దెచ్చుకొని తిండితినకుండ చంద్రశేఖరరావుగారితోఁ జెప్పకుండ నెక్కడకో పోయినది. చంద్రశేఖరరావుగారు భోజనమునకు వచ్చినపు డదియెఱింగి భార్యను కోపపడి ఆముదుసలి దేమైనదో వెతికింప నెక్కడఁగానరాక పోయెను. మఱునాటియుదయమునఁ దనంతదానె యావృద్ధురాలు వచ్చి గోలునసేశ్చి తిరిగి యెప్పటియట్ల పనిసేయఁదొడంగె—ఇట్టివెన్నియో నిదర్శనము లావృద్ధురాలి నాయింటినెవఁబొపక నొండొరుల నంటిపెట్టుకొనియుండునట్లుఁ జేసెడిని.

సిరిసంపత్తులు రెండును సమానముగాఁ గలవా రెక్కడనోగాని కానుపించరు. కాని చంద్రశేఖరరావుగారికి సిరితోఁ సమానముగ సంపత్తియుఁగలదు. ఆయన కిరువురుకొడుకులును నలువురుకొమార్తెలును గలరు. పెద్దకుమార్తె యత్తవారింటఁ గాపురముసేయుచు తొలిపురుడునకుఁ బుట్టింటికి వచ్చినది. రెండవపిల్ల కాపురమునకు మొదటిమాఱు వెడలి భర్త శలవులై చెన్నపట్టణము వెళ్లుటచే తాఁబుట్టిటికి వచ్చియున్నది. మూఁడవపిల్ల మనపురుషసింహునిభార్య. నాలుగవపిల్లకుఁ బెండ్లియీడు వచ్చినది. నలుగురాడపిల్లలతరువాతను నందరునాడపిల్లలే యని యనుకొనుచుండ నిద్దరుమొగపిల్లలు గలిగిరి. అందులోఁ బెద్దవానికిఁ బదియేండ్లు. మూఁడవతరగతి చదువుచుండెను. కాని తండ్రి వానినెప్పుడును "తెలివితక్కువవాఁడవు. పరీక్షలఁబైకిరావని" దూషించుచుండును.

ఆకారణమునఁ గుఱ్ఱవాఁ డంతచిన్నవాఁడయ్యును తండ్రినిఁ దొలఁగి మసలుచుండును. రెండవవాఁడు మిక్కిలి కుఱ్ఱవాఁడు.

చంద్రశేఖరరావుగారికిఁ గాకినాడలో నొకపెద్దమేడ కలదు. ఇల్లెంతయు జనులతోఁ గలకలలాడుచుండును. ప్రతిపూట ననేకులు శిష్టపాఠులు, బ్రాహ్మణులు, సేవకులు భోజనముఁ జేయుచుందురు

మఱియు న్యాయవాదిపదవినధిష్ఠించి ధనమార్జించుచున్నారని వారి బంధుగులపిల్లలు, మేనత్తకొడుకులు, మేనమామకొడుకులు, నలువురెప్పుడిటనుండి విద్యాభ్యాసముఁ జేయుచుందురు. అట్టియెడ మన పురుషసింహుఁడును మామగారియింటనేయుండి చదువుకొనువాఁడని వేఱ చెప్పనక్కరలేదు. పురుషసింహుఁడు చంద్రశేఖరరావుగారి కక్కకొడుకు. అందుచే నల్లుఁడనియేకాక మేనల్లుఁడనికూడ వానియందు మామగారికిఁ బ్రేమ.

చంద్రశేఖరరావుగారిభార్యపేరు సావిత్రి. ఆపె మిక్కిలి జాగరూకతతో నింటఁగలసేవకులయందఱచేతను బనులఁగొనును. కాని వంటలక్క "సీతమ్మ" ఆపెపేరదియు. ఆమెచేమాత్ర మెద్దియోగుద్దులాటలేనిదే పనిసాగించుకొననేరదు. కోడలత్తగారాజ్ఞ నుండఁగలదు. భార్య భర్త్రాజ్ఞనుండఁగలదు కాని గృహయజమానురాలు వంటలక్కయడుగులకు మడుగులొత్తఁగలదా? దానిచిత్తమువచ్చినట్లు నడువఁగలదా? సీతమ్మకు వార్ధక్యము నానాటి కెక్కుడైనకొలది యధికారకాంక్ష యెక్కువగుచు సావిత్రిని మఱింత తెచ్చసేయుచుండెను. ఆకారణమున నాయింట జగడములేనివాసర ముండదు. అట్టినిత్యకలహము చదువరికి హేయముగఁ దోపవచ్చును గాని న్యాయవాదికిఁగాని నాయింటిలోవారికిఁగాని పరిపాటి. సావిత్రికి నింటనంతమందియుండి భంజించుట కొంచెము కష్టము. మగఁడెంతగడించుచున్నను గుటుంబము పెద్దదిగదా! అంతగణనగలమగఁడైనను తనకింకవలసినసగలమరుటలేదని సావిత్రికి సంతాపము. భర్త మిక్కిలివిద్యావంతుఁడని పేరుగాంచి యున్నప్పటికి సావిత్రికి సామాన్యముగ వ్రాయుట చదువుటయైనను చేతఁగాదు. చంద్రశేఖరరావుగారి కొకవేళ భార్యకుఁ జదువుఁజెప్ప మనంబునఁ గోరికయున్నను దీరికలేదు.